# విద్యార్థి వెలుగు

Volume VII - Issue XI - Nov 2024



## పరిపక్వత

సంపాదకీయం

# మనం పరిణితి చెందాలి

మన జీవితాలలో పరిణితి చెందడం ఎంతో ముఖ్యం. అపొస్తలుడైన పౌలు ఎఫెసీయులకు రాసిన లేఖలో, “ప్రేమ గలిగి సత్యము చెప్పుచు క్రీస్తువలె ఉండుటకు, మనమన్ని విషయములలో ఎదుగుదము” అని ఉద్బోధిస్తున్నాడు (ఎఫెసీ 4.15). ఈ వచనం మనం అన్ని విషయాలలో, ముఖ్యంగా మన ఆధ్యాత్మిక జీవితంలో ఎదగాలని, పరిణితి చెందాలని బోధిస్తుంది.

విద్యార్థులైనా, గ్రాడ్యుయేట్సయినా, స్టాఫయినా అందరమూ ఆధ్యాత్మికంగా ఎదగాలి. ఈ ఎదుగుదల మనకు మాత్రమే కాదు, ఇతరులకు కూడా ఆశీర్వాదంగా మారుతుంది. యేసుక్రీస్తును పోలి జీవించడానికి ఎదగాలని మనం కోరుకోవాలి. ఈ ఎదుగుదల ఆధ్యాత్మికంగా, శారీరకంగా, మానసికంగా కూడా ఉండాలి. అందుకు లేఖనాలను చదువుతూ, ధ్యానిస్తూ ఉండడం ఎంతో ముఖ్యం.

“యెహోవా యందు నమ్మికయుంచి మేలు చేయుము దేశమందు నివసించి సత్యము ననుసరించుము” అని కీర్తనలు 37:3 లో చెప్పబడింది.

సత్యమును అనుసరించడం ఎంతో కష్టం. అనేక సవాళ్ళు ఉంటాయి. అయితే, కష్టపడి సత్యాన్ని అనుసరించడం ద్వారా మనం పరిణితి చెందుతాం. సత్యమైన క్రీస్తును అనుసరించడం ద్వారా మన ఆధ్యాత్మిక జీవితంలో తగినంత ఎదుగుదల కలుగుతుంది.

కానీ, సోషల్ మీడియా లాంటి విషయాలలో ఎక్కువ సమయం గడపడం వల్ల మన ఆధ్యాత్మిక ఎదుగుదలకు తీవ్ర విఘాతం కలుగుతుంది. ఈ ఆటంకాలను జయించి, క్రీస్తు ప్రభువును వెంబడించాలి. ఆత్మ ఫలం మన జీవితాలలో పరిణితికి ఒక కొలమానం. ఆధ్యాత్మిక ఎదుగుదలకు, పరిణితికి కారణం లేఖనాలను ధ్యానించడం మాత్రమే కాదు, ఆత్మ ఫలాన్ని మన జీవితాలలో ప్రదర్శించడం.

పరిశుద్ధాత్మ దేవుడు అట్టి కృపను మనందరికీ దయచేయును గాక!

– దాసరి రాజేష్

# విద్యార్థి వెలుగు

Vol. VII - Issue XI - Nov 2024

UESI PUBLICATION TRUST - TELANGANA BRANCH



## EDITORIAL BOARD

Editor and Publisher:
Mr. Dasari Rajesh, Hyderabad

Managing Editor:
Mr. K. John Bhushanam, Cyderabad

UESI PT TG Branch Sec.:
Mr.V Rajendra Prasad, Hyderabad

**Members:**
Mr. S. Simon, Hyderabad
Mrs. P. Raja Kumari, Hyderabad
Mr. S. Jayaraju, Hyderabad
Mr. Raja Sekhar Addanki, Cyderabad
Mrs. L.Vinodha, Sangareddy



## CONTACT DETAILS

The Editor, Vidyarthi Velugu
UESI Publication Trust - Telangana Branch
H. No: 6 - 68/36, Jangampet Village,
Jinnaram Mandal, Sangareddy District, Pin-502319
Ph: 9491595765
Email: editorvv2018@gmail.com



**SCAN THE QR CODE TO SUBSCRIBE VIDYARTHI VELUGU MAGAZINE**

**Annual (Hard+Soft copy)**
Students -150/-
Graduates - 300/-

**For 3 Years (Hard+Soft copy)**
Students - 450/-
Graduates - 900/-

**Life (10 Years - Hard+Soft copy)**
Students & Graduates - 2000/-

**Overseas (10 Years - Soft copy)**
Students & Graduates - 2000/-

**Publication Trust Account**

| | |
|---|---|
| Name | - UESI PUBLICATION TRUST |
| Bank | - Canara Bank |
| A/C No | - **0624101037187** |
| Branch | - East Maredpally, Secunderabad |
| IFSC code | - CNRB0000624 |

Kindly inform the office after depositing amount. Ph. **8985482388**

**Please furnish the following details**
Address, Pincode, Phone Number, Mail Id, Payment Transaction Details


**THEMES:**

| | |
|---|---|
| December | - Jesus Birth: A Divine Event |
| January | - Learn On |
| February | - Race |

Please send your writeups on or before **10th of every month** to editorvv2018@gmail.com

## పాఠకుల స్పందన ...

ప్రియమైన విద్యార్థి వెలుగు పాఠకులకు మనవి. ప్రతినెల వివిలో వచ్చే ఆర్టికల్స్ మీద మీ సూచనలను, నేర్చుకున్న విషయాలు **పాఠకుల స్పందన ...** కు editorvv2018@gmail.com లేక 9491595765 (వాట్సాప్) ద్వారా పంపించగలరు

## విషయ సూచిక


| | |
|---|---|
| Press on to Maturity | 4 |
| పరిణితి | 6 |
| వెలుగు సంబంధుల వలె నడచుకొనుడి | 11 |
| అంతరంగ సౌందర్యం | 16 |
| ఆధ్యాత్మిక స్థైర్యం | 20 |
| ఇసాబెల్లా థోబర్న్ | 22 |
| ధైర్యంగా ఉందాం, భయాన్ని ఎదిరిద్దాం! | 26 |
| Book Review | 30 |


## విజ్ఞప్తి

ప్రియమైన విద్యార్థి వెలుగు పాఠకులకు రక్షకుడు, ప్రభువునైన యేసుక్రీస్తు నామములో శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ క్రింది విషయాలు గమనించాలని కోరుతున్నాము.

1. అడ్రస్ మారినా, మ్యాగజైన్ రాకపోయినా, నూతన సబ్ స్క్రిప్షన్, రెన్యువల్ కొరకు ఆఫీస్ స్టాఫ్ బ్రదర్ డి.సాయి కుమార్ (79933 97630) ను సంప్రదించగలరు.

2. విద్యార్థి వెలుగు పోస్టల్ అవాంతరాలు లేకుండునట్లు, అందరూ చదివి ఆత్మీయ మేలు పొందేటట్లు భారంగా ప్రార్థించండి, ప్రోత్సహించండి.

**ప్రతి నెల ప్రార్థనాంశాలు 10వ తారీఖు లోపల ఇ.యు, ఇ.జి.యఫ్‌కు చెందిన ప్రాముఖ్యమైన రెండు స్తుతి మరియు రెండు ప్రార్థనాంశాలను మాత్రమే వివి ప్రేయర్ పాయింట్స్ లింక్ ద్వారా పంపించగలరు. రచనపై ఆసక్తి కలిగిన వారు తమ వ్యాసములు, కథలు, కవితలు** editorvv2018@gmail.com **కు పంపించగలరు.**

**- విద్యార్థి వెలుగు ఎడిటోరియల్ బోర్డ్**

COVER STORY




# Press on to Maturity

God's desire for us is not simply for us to exist but to thrive and flourish. A core component of this flourishing is spiritual growth, a journey towards maturity that He has ordained for each of us. As Hebrews 6:1 urges, we are called to "press on to maturity." This spiritual growth is a continuous process, mirroring the transformation of a child into an adult, and ultimately leads us to resemble His son, Jesus Christ (Rom 8:29).

## The Foundation of Spiritual Maturity

Just as a physical baby requires time, energy, and proper nourishment to become an adult, our spiritual life requires nurturing and development.

Our spiritual life begins with salvation, a turning point where we repent of our sins and place our faith in Christ's sacrifice (Rom 10:9-10). Through this act, God imputes his righteousness to us, allowing a proper relationship to be established (Rom 3:21-23). This salvation delivers us from the penalty of sin.

## Growing in Grace: The Process of sanctification

The righteousness of Christ then begins to manifest in our lives as we obey God's word and are empowered by the Holy Spirit. This ongoing process of sanctification allows us to fellowship with God and become more like Christ (2 Pet 3:18). In this stage, we are freed from the power of sin.

## The Ultimate Goal: Glorification

The sanctification process will lead to glorification, where we are ultimately delivered from the presence of sin, standing faultless before God in

eternity (Rom 8:18, 2 Cor 4:17). The goal is to be fully conformed to the image of Christ, reflecting his character, conduct, and communication.

## The Fruits of Spiritual Maturity

Mature believers are characterized by several key attributes:

- **Discipleship:** They actively share the gospel, making disciples (Matt 28:19-20). This involves both evangelism (bringing people to Christ) and edification (building them up in the faith) through the teaching of God's word (Col 1:28).
- **Self-Denial:** True disciples deny their own will to follow God's will, embracing a life of self-sacrifice (Lk 9:23). This is evidenced by:
    - **Abiding in God's Word:** Following God's teachings (Jn 8:31-32).
    - **Loving One Another:** Demonstrating Christ like love (Jn 13:34-35).
    - **Bearing Fruit:** Producing the fruits of the Spirit (Jn 15:8, 16).
- **Renewed Minds:** They focus their minds by setting things of God, not the world's (Col 3:1-2), and find their delight in things that are good, pure, lovely, and right (Phil 4:8).
- **Faith and Prayer:** They trust God even when things are difficult, believing He knows what is best. They pray diligently in all circumstances (1 Thes 5:16 -18). A prayerless saint is a powerless saint, missing out on God's presence, power, provision, and protection.
- **Eternal Perspective:** They see life through the lens of eternity, responding to circumstances with a long-term view.

## Qualities of a Spiritually Mature Person:

The Book of James highlights the character traits of mature believers:

- **Positive under Pressure:** They remain positive even when facing trials (Jm 1:2-4).
- **Sensitivity to People:** They are compassionate and caring (Jm 2:8).
- **Mastering the Tongue:** They use their words wisely and constructively (Jm 3:2).
- **Peace-making:** They strive for harmony and reconciliation (Jm 4:1).
- **Patience and Prayerfulness:** They are long suffering and rely on God in prayer (Jm 5:7-8).

## Conclusion

The path to spiritual maturity is a journey of faith, obedience, and growth. It's a continuous process of transformation, leading us closer to Christ and equipping us to live out our faith in a world desperately in need of His love.

## Reference:

Personal Spiritual Life Course Manual by Dennis J. Mock, Atlanta, GA

**- P. Alpha. Anand Raj**
**M.A, M.Ed, Phd. (Education)**
**Visiting Professor N.I.T. Warangal.**

సెల్ఫ్ చెక్



# పరిణితి

## ఆధ్యాత్మిక ఎదుగుదలకు సూచి

మన జీవితాలలో పరిణితి అనేది ఒక కీలకమైన అంశం. మనం ఎదుగుతున్న కొద్దీ, జీవితంలోని వివిధ అంశాలను అర్థం చేసుకుంటూ, మెరుగైన వ్యక్తులుగా తయారవుతాం. ఈ ప్రక్రియలో, ఆధ్యాత్మిక పరిణితి మన మనస్సు, ఆత్మలను సుసంపన్నం చేస్తుంది.

ముఖ్యంగా ఆధ్యాత్మికంగా ఎదగడానికి పరిణతి ఎంతో అవసరం. మనం దేవుని గురించి, ఆయన ప్రేమ గురించి తెలుసుకునే కొద్దీ, మనం ఎలా ప్రవర్తించాలి, ఎలా జీవించాలి అనే వాటి గురించి స్పష్టమైన అవగాహన ఏర్పడుతుంది. ఇది మన ఆధ్యాత్మిక ప్రయాణంలో మనలను ముందుకు నడిపిస్తుంది.

దేవునితో మనకున్న సంబంధం ఎంతో లోతైనది. ఆయన మనలను ఎంతగా ప్రేమిస్తున్నాడో తెలుసుకోవడం, దానికి ప్రతిస్పందనగా మనం ఎలా ప్రవర్తిస్తామన్నది మన పరిణితిని సూచిస్తుంది. దేవుని ప్రేమను అర్థం చేసుకుని, దానికి అనుగుణంగా జీవించడం, ఆయనకు సేవ చేయడం పరిణితి యొక్క ప్రధాన లక్షణాలు.

### 1. పరిశుద్ధత మర్చిపోయిన వారు పరిణితి చెందుతారా?

పరిపూర్ణుడైన దేవుని పరలోకపు పిలుపు నందుకుని, పరిశుద్ధతలో కొనసాగుతామని తీర్మానం చేసి పవిత్ర క్షణాలు మరిచిన వారు ఎలా పరిణితి చెందుతారు? పతన స్థితిలో ఉన్న మనకొరకు, పరమును విడిచి ప్రేమగా పలకరించి పేగు బంధం కన్నా నా ప్రేమ బంధం మిన్న అని ప్రాణం పెట్టిన ప్రభువు త్యాగాన్ని మరిచిన వారు పరిణితి చెందారని ఎలా చెప్పగలం?

దేవునితో చేసిన తీర్మానాలను గుర్తుంచుకుని, ఆయనకు విధేయులై ఉండటమే నిజమైన పరిణితికి ఆనవాలు.

### 2. అనుభవం పెరిగే కొద్దీ పరిణితి పెరగాలా?

సీనియారిటీ పెరిగే కొద్దీ సిన్సియారిటీ తగ్గుతుందనేది ఎంతోమంది జీవితాల్లో వాస్తవం. కానీ దేవునిలో అనుభవం పెరిగే కొద్దీ పరిణితి పెరగాలని బైబిల్ చెప్తుంది గదా! ఎంత నేర్చుకున్నామన్నది మాత్రమే ముఖ్యం కాదు కాని శిష్యులుగా ఎంత ఎదిగామన్నది కూడా ముఖ్యం. “ఎదిగిన కొద్దీ ఒదగాలి” అన్నది సామెత కానీ ఇది చాలామంది జీవితాల్లో సత్య దూరంగానే ఉందని చెప్పక తప్పదు. ఎంత సాధించినా, ఎంత నేర్చుకున్నా ఆధిక్యతలు ఎన్ని ఉన్నా, తలాంతులు ఎన్ని ఇవ్వబడ్డా, గొప్ప ప్రసంగాలు చేసినా, ఎంత పరిచర్య చేసినా బైబిల్ నాలెడ్జ్ ఎంత ఉన్నా, నేను

కాను క్రీస్తే అన్న అనుభవంలోనికి వచ్చేంతవరకు మనకు పరిణితి రాలేదనేది ఎంతైనా వాస్తవం.

దేవునితో మనకున్న సంబంధంలో అనుభవం పెరుగుతున్న కొద్దీ, మనం మరింత వినయమనస్కులై సేవకులంగా ఉండాలి. మనం ఎంత నేర్చుకున్నా, మనకున్న నైపుణ్యాలు ఎన్ని ఉన్నా, మనం దేవుని ప్రణాళికలో భాగమేనని గుర్తుంచుకోవడం ముఖ్యం.

### 3. నిజమైన పరిణితికి ఉదాహరణలు

నిజమైన పరిణితి యొక్క ప్రధాన లక్షణం దేవుని కృపను గుర్తించడం. మన జీవితంలో మనం అనుభవించే ప్రతి మంచి విషయం, ప్రతి సత్కార్యం, మన విజయం, ఇవన్నీ దేవుని కృప ఫలితమేనని గ్రహించాలి.

- ★స్త్రీలు కనిన వారిలో యోహాను కంటే గొప్పవాడు లేదని ప్రభువు అంటే, ఆయన చెప్పులు వారు ఇప్పుటకైనా నేను అర్హుడను కానని చెప్పడం నిజమైన పరిణితి కాదా!
- ★నా ఇల్లంతటిలో నమ్మకమైన వాడు, భూమి మీద మిక్కిలి సాత్వికుడని చెప్పబడిన మోషే, దేవుని మాటకు లోబడి ఇశ్రాయేలీయులను నడిపించిన నాయకుడిగా ఎంతో పరిణితి చూపించాడు.

### 4. పరిణితిని నిర్వచించే మరికొన్ని అంశాలు

క్షమించబడి క్షమించకపోతే, ప్రేమించబడి ప్రేమించకపోతే, ఆదరించబడి ఆదరించకపోతే, కరుణించబడి కరుణించకపోతే, రక్షించబడి రక్షించకపోతే పరిణితి చెందారని ఎలా చెప్పగలం?

పరిణితి చెందిన వ్యక్తి, తాను అందుకున్న దేవుని కృపను ఇతరులతో పంచుకోవాలి. క్షమించబడిన వారు, ఇతరులను క్షమించాలి. ప్రేమించబడిన వారు, ఇతరులను ప్రేమించాలి. దేవుని కృపను అనుభవించిన వారు, ఆ కృపను ఇతరులకు అందించాలి. ఇది పరిణతి యొక్క ప్రాథమిక లక్షణం.

### 5. క్రైస్తవ పరిపక్వతలో విద్యార్థులు మరియు గ్రాడ్యుయేట్స్

క్రైస్తవ పరిపక్వత ఒక నిరంతర ప్రక్రియ. దేవుని వాక్యాన్ని అధ్యయనం చేయడం, ప్రార్థన చేయడం, సహవాసంలో పాల్గొనడం, మరియు సేవ చేయడం ద్వారా మనం క్రీస్తులో ఎదుగుతూ, దేవుని రాజ్యం యొక్క విలువలను అనుసరించ గలుగుతాం.

విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ మరియు క్రైస్తవ నాయకులు, జీవితంలోని వివిధ దశల్లో ఉన్నప్పటికీ, దేవునితో మరింత లోతైన సంబంధాన్ని ఏర్పరచుకొని, విశ్వాసంతో జీవించి, ఇతరులను ప్రేమతో సేవించడానికి పిలువబడ్డారు.

కాబట్టి, క్రైస్తవ పరిపక్వత, వయస్సుకు లేదా విద్యా విజయాలతో సంబంధం లేదు. అది పూర్తిగా దేవునికి అంకితం చేయబడిన హృదయంతో వస్తుంది. బైబిల్ విశ్వాసులను "మన ప్రభువైన రక్షకుడు యేసు క్రీస్తు కృపయందును జ్ఞానమందును అభివృద్ధి చెందవలెనని" చెబుతుంది (2 పేతురు 3:18). ఈ పరిపక్వత, ఆత్మ ఫలాలలను ఇస్తున్న జీవితం (గలతీయులకు 5:22-23), విశ్వాసంలో స్థిరంగా ఉంటూ సువార్త యొక్క శక్తిని సాక్ష్యంగా చూపించడం ద్వారా వ్యక్తమవుతుంది.

#### ఎ) విద్యార్థులు మరియు క్రైస్తవ పరిపక్వత

విద్యార్థి దశ అనేది వ్యక్తి జీవితంలో అత్యంత ముఖ్యమైన దశ. ఈ సమయంలో వారు తమ భవిష్యత్తును నిర్మించుకోవడానికి అవసరమైన నైపుణ్యాలు, విలువలు మరియు జ్ఞానాన్ని పొందుతారు. అయితే, ఈ సమయంలో వారు అకడమిక్ ఒత్తిళ్లు, సామాజిక ప్రభావాల వంటి వివిధ రకాలైన మార్పులను ఎదుర్కొంటారు. ఈ సవాళ్లను ఎదుర్కొని, ఆధ్యాత్మిక, భౌతిక జీవితాలకు దృఢమైన పునాదిని నిర్మించుకోవడానికి పరిపక్వత చాలా అవసరం.

#### విద్యార్థులు పరిపక్వత చెందడానికి ముఖ్యమైన అంశాలు:

- ★**క్రీస్తులో గుర్తింపు:** మన విలువ అకడమిక్ విజయాల లేదా సామాజిక హోదా నుండి కాకుండా, దేవుని పిల్లలుగా ఉండటం ద్వారా వస్తుందని గ్రహించాలి (1 యోహాను 3:1). క్రీస్తులో మన అసలైన పౌరసత్వాన్ని అంగీకరించాలి.

★**రోజువారీ ఆరాధన:** ప్రార్థనలో గడపడం, బైబిల్ చదవడం మరియు దేవుని వాక్యాన్ని ధ్యానించడం అలవాటుగా చేసుకోవాలి. ఇది జీవితంలోని ఒడిదుడుకుల సమయంలో మనకు ఆధ్యాత్మిక స్థిరత్వాన్ని ఇస్తుంది (కీర్తన 119:105).

★**తెలివైన నిర్ణయాలు:** విద్యార్థి దశలో స్నేహితుల ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. పరిపక్వమైన క్రైస్తవుడు, సమాజానికి వ్యతిరేకంగా ఉన్నప్పటికీ, దేవుని మార్గాన్ని అనుసరించడాన్ని ఎంచుకుంటాడు (రోమా 12:2).

## బి) గ్రాడ్యుయేట్స్ మరియు క్రైస్తవ పరిపక్వత

వాస్తవ ప్రపంచంలో విజయవంతం కావాలంటే, గ్రాడ్యుయేట్స్‌కు దేవునిపై లోతైన విశ్వాసం, క్రైస్తవ పరిపక్వత అత్యంత అవసరం. ఈ రెండూ కలిసి, వారు ఎదుర్కొనే సవాళ్ళను అధిగమించడానికి, తమ జీవితంలో దేవుని చిత్తాన్ని నెరవేర్చడానికి సహాయ పడతాయి.

### గ్రాడ్యుయేట్స్ పరిపక్వత చెందడానికి ముఖ్యమైన అంశాలు:

★**దేవుని ప్రణాళికను నమ్ముట:** ఉద్యోగం, ఆర్థిక పరిస్థితులు మరియు సంబంధాలపై ఇబ్బందులు రావడం సహజం. జీవితంలో ఎదురయ్యే ఈ సవాళ్ళు మనల్ని కలచివేసి, నిరాశకు గురిచేయవచ్చు. అయితే, ఈ సమయాల్లో మనం దేవునిపై నమ్మకం ఉంచుకోవడం చాలా ముఖ్యం.

మన జీవితంలోని కఠినమైన పరిస్థితులను దేవుని ప్రణాళికలో భాగంగా గ్రహించడం కష్టంగా ఉండవచ్చు. కానీ, మనం దేవునిపై నమ్మకం ఉంచినప్పుడు, ఈ ఇబ్బందులను అధిగమించే శక్తిని ఆయన మనకు ఇస్తాడు. దేవుని ప్రణాళిక కొన్నిసార్లు మనం ఊహించినట్లుగా ఉండకపోవచ్చు, కానీ ఆయన మనకు మంచిదే చేస్తాడని విశ్వసించడం చాలా ముఖ్యం.

పరిపక్వ క్రైస్తవుడు దేవునిపై నమ్మకం ఉంచుతాడు (యిర్మీయా 29:11), ఎందుకంటే ఆయన సార్వభౌముడు. ఆయన మన జీవితాలను పాలిస్తున్నాడు మరియు మనకు మంచిదే చేయాలని కోరుకుంటున్నాడు. మనం అర్థం చేసుకోలేని విధంగా కూడా ఆయన మన కోసం పనిచేస్తున్నాడు.

★**జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి దేవునికి మహిమకరముగా జీవించుట:** జీవితంలోని సవాళ్ళు మనల్ని కృంగదీయకూడదు. బదులుగా, మనం వాటిని దేవునికి మహిమ కలిగించే అవకాశాలుగా మార్చుకోవాలి. క్రైస్తవ పరిపక్వతే ఈ లక్ష్యాన్ని సాధించడానికి మార్గం. దేవునిపై మన విశ్వాసాన్ని, ఆయన వాక్యాన్ని, మరియు ప్రార్థనను బలోపేతం చేసుకోవడం ద్వారా మనం ఎటువంటి సవాళ్ళనైనా అధిగమించి, దేవునిని మహిమ పరచగలం.

## 6. క్రైస్తవ పరిణితి యొక్క ముఖ్య అంశాలు

క్రైస్తవ విశ్వాసంలో, పరిణితి అనేది ఒక నిరంతర ప్రయాణం. ఇది కేవలం ఒక నిర్దిష్ట సమయంలో లేదా వయసులో చేరుకునే లక్ష్యం కాదు. బదులుగా, ఇది దేవునితో మన సంబంధాన్ని లోతుగా చేసుకోవడం, ఆయన చిత్తానికి అనుగుణంగా జీవించడం మరియు మన చుట్టూ ఉన్నవారికి క్రీస్తు ప్రేమను ప్రతిబింబించడం. ఈ ప్రయాణంలో, కొన్ని ముఖ్యమైన అంశాలు మనల్ని మార్గనిర్దేశం చేస్తాయి.

## ఎ) దేవునిని ప్రథమ స్థానంలో ఉంచడం

మన జీవితంలో అనేక విషయాలు మన దృష్టిని ఆకర్షిస్తాయి – చదువు, సాంఘిక సంబంధాలు, వృత్తి ఆశయాలు మరియు వ్యక్తిగత లక్ష్యాలు. అయితే, పరిణితి చెందుతున్న క్రైస్తవునిగా, మన ప్రథమ కర్తవ్యం దేవుని రాజ్యాన్ని మరియు ఆయన నీతిని వెదకడమే కావాలి (మత్తయి 6:33). దీని అర్థం మన జీవితంలో దేవునికి ప్రథమ స్థానాన్ని ఇవ్వడం. ప్రార్థన, దేవుని వాక్య పఠనం మరియు సహవాసం కోసం సమయం కేటాయించడం ద్వారా మనం దేవునితో మన సంబంధాన్ని పటిష్ఠపరుచుకోవచ్చు. నిజ క్రైస్తవుడు క్రీస్తుతో సన్నిహిత సంబంధం అన్నిటికంటే విలువైనదని భావిస్తాడు.

### బి) క్రీస్తు సాక్షిగా జీవించడం

కళాశాల మరియు విశ్వవిద్యాలయాల వాతావరణంలో, విద్యార్థులు వివిధ సామాజిక మాధ్యమాల ప్రభావం ఎదుర్కొంటారు. పరిణితి చెందిన క్రైస్తవుడు ఈ వాతావరణంలో కూడా స్థిరంగా ఉంటాడు మరియు యేసుక్రీస్తు ప్రేమ మరియు సత్యం కోసం సాక్షిగా జీవిస్తాడు (మత్తయి 5:16). మన నడవడిక, యథార్థత, మాటల ద్వారా ఇతరులకు పరలోక మార్గాన్ని చూపిస్తూ, మన వెలుగును ప్రకాశింపజేయడానికి మనం పిలువబడ్డామని గుర్తుంచుకోవాలి.

సమస్యలు లేదా సామాజిక ఒత్తిడిని ఎదుర్కొన్నప్పుడు, క్రీస్తులోని మన గుర్తింపును గుర్తుచేసుకోవడం చాలా ముఖ్యం. మనం దేవుని పిల్లలమని మరియు ఆయన ప్రేమ మనలో నిండి ఉందని తెలుసుకోవడం మనల్ని బలపరుస్తుంది.

### సి) ఆధ్యాత్మిక ఎదుగుదల

క్రైస్తవ పరిణితి అనేది ఒక్కసారిగా వచ్చే విషయం కాదు. ఇది ఒక కళాశాల ప్రయాణం వంటిది – సమయం, క్రమశిక్షణ మరియు ఓర్పు దీనికి అవసరం. పేతురు విశ్వాసంలో, జ్ఞానంలో, ప్రేమలో పెరగాలని విశ్వాసులను ప్రోత్సహిస్తాడు (2 పేతురు 3:18). ఈ ఎదుగుదలలో బైబిల్ అధ్యయనం, ప్రార్థన, ఇతర విశ్వాసులతో సహవాసం మరియు జీవితంలోని కష్టాల నుండి నేర్చుకోవడం ఉంటుంది.

మన ఆధ్యాత్మిక జీవితాన్ని పరిశీలించుకోవడం చాలా అవసరం. క్రీస్తుతో లోతైన సంబంధం కలిగి ఎదుగుతున్నామా? ఆయన వాక్యాన్ని బాగా అర్థం చేసుకుంటున్నామా? మరియు దాన్ని జీవితంలో అమలు చేస్తున్నామా? మనం ఎదుగుతున్న కొద్దీ ఓర్పుతో కూడిన మనసును కలిగి ఉంటున్నామా? అనే ప్రశ్నలు మనల్ని మార్గనిర్దేశం చేస్తూ ఉండాలి.

### డి) విశ్వాసంతో ఒత్తిడి, ఆందోళనను ఎదుర్కోవడం

విద్యార్థులు, పరీక్షల ఒత్తిడి నుండి భవిష్యత్తు గురించి నిర్ణయాలు తీసుకునే వరకు, అధిక ఒత్తిడిని ఎదుర్కొంటారు. క్రైస్తవ పరిణితి అంటే ఆందోళనలను దేవునికి అప్పజెప్పడం నేర్చుకోవాలి. ఎందుకంటే, “ఆయన మిమ్మును గూర్చి చింతించుచున్నాడు గనుక మీ చింత యావత్తు ఆయనమీద వేయుడి” అని పేతురు సెలవిస్తున్నాడు (1 పేతురు 5:7). ఒత్తిడి మనలను ప్రభావితం చేయడానికి వీలు లేకుండా, ప్రార్థన ద్వారా దేవుని నడిపింపును, దైవిక సలహాలను కోరాలి.

ఒత్తిడికి లోనైనప్పుడు, మొదట ప్రార్థనలో దేవుని వైపుకు మళ్లాలి. దేవునిపై విశ్వాసం మరియు వాగ్దానాలను గుర్తుచేసే లేఖనాలను కంఠస్తం చేయాలి. అవసరమైతే, విశ్వసనీయమైన మెంటార్స్ లేదా స్నేహితుల నుండి సహాయం కోరడానికి సిగ్గుపడకూడదు.

### ఇ) విద్యలో నిజాయితీ మరియు బాధ్యత

క్రైస్తవ పరిపక్వతలో ముఖ్యమైన లక్షణం నిజాయితీ – ఎవరు చూడనప్పుడు కూడా యాదార్థంగా ఉండటం. విద్యా జీవితానికి ఇది ప్రత్యేకంగా వర్తిస్తుంది. పరీక్షల్లో కాపీ కొట్టడం, అసైన్‌మెంట్లను కాపీచేయడం లేదా తప్పుడు మార్గాల ద్వారా విజయాన్ని పొందడం లాంటివి తాత్కాలికంగా కలిసివచ్చినా, అది దేవునికి అవమానం తెస్తుంది. క్రైస్తవులుగా, దేవుని మహిమ కోసం ప్రతిదీ చేయాలని మనం పిలవబడ్డాం (కొలస్సయులు 3:23).

నిజాయితీగా ఉండి దేవుడు ఇచ్చిన తలాంతులతో కష్టపడాలని నిర్ణయించుకోవాలి. ఆయన మన విశ్వాసానికి తగిన కాలంలో ప్రతిఫలం ఇస్తాడని నమ్మాలి.

### ఎఫ్) క్రీస్తు ప్రేమతో ఇతరులను ప్రేమించడం

క్రైస్తవ పరిపక్వత సంబంధాల్లో ప్రతిబింబిస్తుంది. మనం విశ్వాసంలో ఎదిగినప్పుడు, క్రీస్తు మనపట్ల చూపినట్లు ప్రేమను, కరుణను మరియు క్షమాపణను చూపవలసిన అవసరం ఉంది. (ఎఫెసీయులు 4:32). ఇది కుటుంబానికి, స్నేహితులకు మరియు మనకు అన్యాయం చేసే వారికి కూడా వర్తిస్తుంది. క్రీస్తు సారూప్య సంబంధాలను పెంచడంలో ఉద్దేశపూర్వకంగా ఉండాలి. మన పరస్పర

సంబంధాల్లో ఓర్పు, అవగాహన మరియు క్షమాపణను పాటించాలి. ఇతరులను సేవించే మరియు ప్రోత్సహించే అవకాశాల కొరకు ఎదురు చూడాలి.

**జి) కెరీర్ మరియు జీవితంలో దేవుని పిలుపునకు అనుసరించడం**

చదువు ప్రయాణం ముగియడానికి దగ్గరగా ఉన్నప్పుడు, కెరీర్ మార్గాలు మరియు జీవిత నిర్ణయాల గురించిన ఆలోచనలు మరింత తీవ్రంగా మారతాయి. క్రైస్తవ పరిపక్వత అంటే ఈ నిర్ణయాల్లో దేవుని చిత్తాన్ని అనుసరించడం, మన జీవితం పట్ల ఆయనకు ప్రత్యేకమైన ఆలోచన ఉందని విశ్వసించడం (యిర్మీయా 29:11). మీరు ఎలాంటి కెరీర్ ఎంచుకున్నా, మీ పిలుపు దేవుని సేవ చేయడమేనని గుర్తుంచు కోవడం ముఖ్యం.

మీ భవిష్యత్తు కోసం దేవుడు తన చిత్తమును వెల్లడించుటకు ప్రార్థనలో సమయం గడపాలి. మీకు మార్గనిర్దేశం చేయగల క్రైస్తవ మెంటర్స్ నుండి మంచి సలహాలను కోరాలి. ఊహించని విధానాలలో కూడా దేవుని మార్గాన్ని అనుసరించ డానికి సిద్ధంగా ఉండాలి.

**ముగింపు**

క్రైస్తవ పరిణతి, కేవలం చర్చికి హాజరు కావడం, ప్రార్థన చేయడం లేదా బైబిల్ చదవడం వంటి బాహ్య కార్యకలాపాలకే పరిమితం కాకూడదు. మన హృదయంలో, మన జీవనశైలిలో కూడా ప్రతిబింబించాలి. మనం ఎలా మాట్లాడుతున్నాం, ఎలా ప్రవర్తిస్తున్నాం, ఇతరులతో ఎలా సంబంధం పెట్టుకుంటున్నాం అన్నది కూడా మన క్రైస్తవ పరిణతిని తెలియజేస్తుంది. మన జీవితాల ద్వారా యేసుక్రీస్తు ప్రేమను ప్రదర్శించడం, ఆయన బోధనలను పాటించడం, మన చుట్టూ ఉన్న వారికి సేవ చేయడం మొదలైనవి పరిణితి చెందిన క్రైస్తవ జీవితాన్ని సూచిస్తాయి.

– రక్షణ్ శీలం, గ్రాడ్యుయేట్, కొత్తగూడెం

* * * * * *

## AVD Central Telangana Singing Competition A Resounding Success!

Dear brothers and sisters,

I take this opportunity to express my heartfelt gratitude and praise to our Almighty God for enabling AVD to successfully conduct the Central Telangana Singing Competition. The event was a resounding success, with nearly 22 participants (students and graduates) showcasing their talents. Thank you for your faithful prayers, which undoubtedly played a vital role in this achievement.



I would also like to extend my sincere thanks to our Executive Committee (EC), Regional Coordinators (RCs), and District Coordinators (DCs) for their continuous support to AVD.

Furthermore, I humbly request your continued prayers for the ***West Telangana Singing Competition, scheduled for November 15th in Medak.*** Finally, a big thank you to the dedicated AVD team whose hard work made this event possible.

**- G Ganga Rao, Secretary, AV Dept.**



# వెలుగు సంబంధుల వలె నడచుకొనుడి

(ఎఫెసీ 5:8-14)

సముద్రంలో 400 మీటర్ల లోతునుండి పగలు, రాత్రి తేడా వుండదు. కారణమేమిటంటే ఆ లోతులోనికి కాంతి కిరణాలు చొచ్చుకొని వెళ్ళలేవు. ఈ పరిణామం అక్కడ వుండే జీవులపై విపరీతమైన ప్రభావాన్ని చూపిస్తుంది. సముద్రపు సగటు లోతు 3 మైళ్లు. సముద్రంలో చాలా భాగం సంపూర్ణమైన గాఢాంధకారంతో వుంటుంది. దానితో పాటు లోతు పెరిగే కొలది శరీరంపై ఒత్తిడి కూడా పెరుగుతుంది.

అయినా కూడా సముద్రము పై నుండి అడుగు వరకు జీవులు నివసించడానికి కారణం, ఈ పరిస్థితులకు తగిన విధంగా వాటి ఆకారం, జ్ఞానేంద్రియాలు, జీవక్రియలు, శరీర ధర్మశాస్త్రం ఏర్పడి వుంటుంది ఈ చీకటిలో జీవించే జీవులను వెలుగులోనికి తీసుకొని వస్తే అని జీవించలేవు.

దేవుని వాక్యంలో మానవుని సహజ పర్యావరణం చీకటి అని, రక్షణ కార్యం ద్వారా మనము వెలుగు సంబంధులముగా చేయబడ్డామని అనేక సందర్భాలలో చెప్పబడింది. చీకటి, వెలుగు అని చెప్పబడిన ఈ పదములకు దైవగ్రంథంలో ఆత్మీయ అర్థము అబద్ధము, సత్యమని భాష్యం చెప్పగలం (కొలస్స 1:13, ఎఫెసీ 5:8 1 థెస్స 5:5).

ఒక విశ్వాసి రక్షణ కార్యం ద్వారా ఈ అబద్ధములో నుండి సత్యములోనికి వచ్చినప్పుడు, అతనికి ఏమి జరుగుతుంది? అతనికి వెలుగులో జీవించడానికి ఎలాంటి ఏర్పాట్లు చేయబడ్డాయి? అవి ఉపయోగించు కోకపోయిన యెడల విశ్వాసికి ఏమి సంభవిస్తుంది మొదలగు విషయాల గురించి ఆలోచించుదాం.

## 1. అద్భుత రవాణా

"ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములోనుండి విడుదల చేసి తాను ప్రేమించిన తన కుమారుని రాజ్య నివాసుల నుగా చేసెను" (కొలస్స 1:13). ఈ వాక్యంలోని "విడుదల చేసి" అనే పదానికి బదిలీ చేయబడడం లేదా రవాణా చేయబడడం అని అర్థం. అంటే, మనం ఒక రాజ్యం నుండి మరియొక రాజ్యంలోకి రవాణా చేయబడ్డాం. ఒకప్పుడు మనం అబద్ధం చేత పరిపాలించబడ్డాం. మన దృక్పథాలు, కోరి కలు, ఎంపికలు, విలువలు, భావోద్రేకాలు, కార్యాలు అన్ని అబద్ధం చేత ప్రభావితం

అయ్యాయి. అలాంటి మనలను, తన సువార్త సత్యం ద్వారా సంధించి, ఆ సత్యం మనకు గ్రాహ్యపరచి, అనుగ్రహ్యంగా ఆ అబద్ధ లోకంలో నుండి సత్యం లేదా వెలుగు జీవితంలోనికి రవాణా చేయబడ్డాం.

### 2. క్రొత్త లోకంలో (వెలుగు) జీవించడానికి దేవుడు చేసిన ఆత్మీయ ఏర్పాట్లు

మొదటిగా, దేవుని సత్యాన్ని (వెలుగు) గ్రహించడానికి మన మనస్సులకు సామర్థ్యాన్ని అనుగ్రహించాడు. దీనినే మనోనేత్రాలు వెలిగింపబడడం అని దేవుని వాక్యంలో వ్రాయబడింది (ఎఫెసీ 1:17). ఈ కార్యం జరగకుండా ఏ వ్యక్తి దేవుని సత్యాన్ని అర్థం చేసుకోలేడు. అవిశ్వాసికి ఇవి నిరుపయోగంగా ఉంటుంది (2 కొరింథీ 4:4).

ఎలా అంటే, విశ్వాసి దేవుని వాక్యాన్ని ధ్యానిస్తున్నప్పుడు, పరిశుద్ధాత్మ దేవుడు మన మనోనేత్రాల ద్వారా వాక్య ప్రత్యక్షత అనుగ్రహిస్తాడు. దీనినే దేవుని స్వరమును వినడం లేదా ఆత్మ ద్వారా నడిపించబడడం అని అంటాం. విశ్వాసి ఆత్మ దేవుడు వాక్యా సత్యాన్ని ప్రత్యక్ష పరచినప్పుడు, దానికి విధేయత చూపించడం తప్పని సరి.

రెండవదిగా, దేవుడు ప్రతి విశ్వాసికి పాప స్వభావం యొక్క ప్రభుత్వం నుండి తమ మనసును విడుదల చేసుకొనే సామర్థ్యాన్ని అనుగ్రహించాడు (రోమా 6:14). ఈ విమోచించబడిన మనసు “దేవుని రాజ్యము”గా చేయబడుతుంది.

దేవుని రాజ్యములో దేవుని చిత్తము జరగడానికి, మనస్సు దేవుని సత్యముతో వెలిగించబడుతూ ఉండాలి. మనసును ఆత్మ దేవుని అధికారం క్రింద ఉంచవలసిన బాధ్యత విశ్వాసిదే!

మూడవదిగా, పాపస్వభావం మనస్సు మీద ప్రభుత్వం చెయ్యక పోయినా, మన శరీరంలో దాని ఉనికి కలిగి ఉంటుంది. దానిని దాని ఆశల నుండి కాపాడడానికి, ఆత్మ దేవుడు క్రీస్తు ప్రభువు యొక్క పోలిక కలిగిన ‘నూతన స్వభావాన్ని’ సృష్టిస్తాడు (కొలస్స 3:10). ఈ నూతన స్వభావం మనలో మంచి కోరికలు, ఆశలను ఉత్పత్తి చేస్తుంది.

### 3.వెలుగు ఫలము (ఎఫెసి 5:9)

విశ్వాసి దేవుని సత్యాన్ని వాక్య ‘ధ్యానం ద్వారా మనోనేత్రాల సహాయంతో పొందుచూ, ఆత్మ దేవుని నడిపింపునకు విధేయత చూపిస్తున్నప్పుడు, 1 యోహాను 1:7లో చెప్పబడిన “అన్యోన్య సహవాసం” ప్రభువుతో కలిగి ఉంటాడు. ఈ అన్యోన్య సహవాసం విశ్వాసిలో నుండి వెలుగు జీవిత ఫలము లేక ఆత్మ ఫలమును ఉత్పత్తి చేస్తుంది. ఈ ఫలము కేవలం వెలుగు సంబంధులకు మాత్రమే సాధ్యమవుతుంది. ఆత్మ ఫలము ద్వారా యేసుప్రభువు జీవన విధానము, జీవము లోకమునకు కనపడుతుంది.

### 4. మనోనేత్రాల విషయమైన హెచ్చరిక (ఎఫెసీ 5:14)

వెలుగు సంబంధుల వలె నడచుకోవాలని కోరి దేవుడు చీకటి (అబద్ధం) నుండి వెలుగు (దేవుని సత్యం) లోనికి తెచ్చిన వారందరికీ దేవుడు ఒక హెచ్చరికను ఇవ్వడాన్ని గమనించగలం. చీకటి నుండి వెలుగులోకి తేబడిన వారు తమ జీవితాలలోని ఈ వెలుగును లోకానికి చూపించ వలసిన బాధ్యత కలిగి ఉంటారు. ఈ వెలుగు వారిది కాదు; అది దేవుడు తన విశేష కనికరము వలన ఉచితముగా ఇచ్చిన వెలుగు (యోహాను 1:9).

కానీ, కొందరు విశ్వాసుల జీవితాలలో, దేవుడు ఇచ్చిన ఈ వెలుగుతో వెలుగు రాజ్యంలో జీవించడానికి బదులు, తమ వెలుగును చీకటిగా మార్చుకుంటున్నారు. ఈ పతనానికి కారణం మనోనేత్రాలను ఉపయోగించకపోవడమే. దేవుని సత్యం నిరంతరం విశ్వాసి మనసులోకి ప్రవేశిస్తూ ఉండాలని దేవుని వాక్యం సెలవిస్తుంది. తద్వారా ఆ వ్యక్తి తనలోని పాత, అబద్ధ సంబంధమైన దృక్పథాలను సరిచేసుకుని, ఉత్తమమైన, అనుకూలమైన, సంపూర్ణమునైన దేవుని చిత్తమును పరీక్షించి తెలుసుకుంటూ, మనసు మారుతూ రూపాంతరం చెందాలి. ఈ ప్రక్రియ చనిపోయేంత వరకు నిరంతరం కొనసాగే క్రియ.

దేవుని వాక్య ధ్యానం, ప్రార్థన ద్వారా విశ్వాసి దేవునిపై ఆధారపడకుండా తన స్వంత శక్తి సామర్థ్యాలతో ఆత్మీయ జీవితం జీవించడానికి

ప్రారంభించినప్పుడు, మనోనేత్రాలు నెమ్మదిగా కృశించిపోతాయి. దీనినే దేవుని వాక్యం "ఆత్మీయ మత్తు", 'నిద్ర', "చీకటి బ్రతుకు" అని పిలుస్తుంది. 1 థెస్స 5:5-8 వచనాలు ఈ సత్యాన్ని స్పష్టంగా తెలియజేస్తాయి. "మీరందరు ను వెలుగు సంబంధులును, పగటి సంబంధులునై యున్నారు. మనము రాత్రి వారము కాము, చీకటి వారము కాము. కావున ఇతరుల వలె నిద్రపోక మెళకువగా నుండి మత్తులము కాక యుందము. నిద్రపోవువారు రాత్రి వేళ నిద్ర పోవుదురు. మత్తుగా ఉండువారు రాత్రి వేళ మత్తుగా వుండురు. మనము పగటి వారమై యున్నాము గనుక మత్తులమై యుండక..."

ఈ వచనాలు మనకు ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తున్నాయి. ఇక్కడ ఉపయోగించబడిన నిద్ర, చీకటి, పగలు, మత్తు, రాత్రి వంటి పదాలు ఆత్మీయ అర్థాలను కలిగి ఉన్నాయి.

ఆత్మీయ నిద్ర లేదా మత్తు అంటే మనోనేత్రాలను మూసుకొని, దేవునితో ఉన్న సంబంధాన్ని విస్మరించేటట్లు చేస్తుంది. విశ్వాసికి వెలుగు జీవితం లేదా దేవుని సత్యానికి లోబడి జీవించడమనేది దేవుని వాక్యం, ప్రార్థనల వలన మాత్రమే సాధ్యం.

అనేక విశ్వాసుల జీవితాలలో వెలుగు జీవితం లేకపోవడానికి కారణం ఈ ఆత్మీయ నిద్రే అని చెప్పవచ్చు. దేవునితో ఉన్న మన సంబంధం బలహీనపడుతుంది, మన హృదయాలు దేవుని వాక్యానికి మూసుకుపోతాయి, దేవునితో కలిసి నడవాలనే కోరిక తగ్గుతుంది.

ఎఫెసీ 5:14వ వచనంలో దేవుడు మనకు ఒక ప్రాముఖ్యమైన హెచ్చరిక ఇస్తున్నాడు. ఆ హెచ్చరిక ఎవరికీ? నిద్రించుచున్న విశ్వాసులకే!

నిద్రించుచున్న విశ్వాసిని, మృతుణ్ణి దేవుడు ఒకే పరిస్థితిలో చూపుతున్నాడు. ఎందుకంటే, ఇద్దరూ కళ్ళు మూసుకొని వుంటారు. ఇద్దరి బ్రతుకులోనూ చీకటి అలుముకొని ఉంటుంది. వారు తమ చుట్టూ జరుగుతున్న పరిణామాలను గ్రహించలేరు. ఇరువురు దేవునికి గాని, మనుష్యులకు గాని ఏ విధంగానూ ఉపయోగపడరు.

కానీ, వారిలో ఒకే ఒక తేడా ఉంది. అది ఏమిటంటే, నిద్రిస్తున్న విశ్వాసి జీవించి ఉన్నాడు. అంటే, అతని శరీరంలో జీవం ఉంది. కానీ, అతని ఆత్మ నిద్రలోకి జారుకున్నట్టుగా, లేదా మత్తులో ఉన్నట్టుగా ఉంది.

### దేవుని వాక్యంలో నిద్రావస్థకు గురైన భక్తులు

దేవుని వాక్యంలో కొందరు నిద్రపోకూడని సమయంలో నిద్రపోయి ఎంతో నష్టపోయారు. వారి జీవితాలు మనకు కొన్ని విలువైన ఆత్మీయ పాఠాలను నేర్పిస్తాయి.

#### ఎ) యోనా నిద్ర

యోనా ఒక గొప్ప ప్రవక్త. అయితే, ఒకానొక సమయంలో దేవుని చిత్తాన్ని స్పష్టంగా ఎరిగి కూడా, దానిని చేయడానికి మనసు లేక దేవుని సన్నిధి నుండి దూరంగా పారిపోడానికి తర్షీషు ఓడ ఎక్కి ప్రయాణం చేస్తున్నాడు. ఓడ క్రింది భాగంలో ఒక మూలన గాఢ నిద్రలో ఉన్నాడు. అతనిని లేపడానికి అన్నట్లుగా దేవుడు ఒక గొప్ప తుఫానును పంపించాడు.

యోనా నిద్రను, దేవుని చిత్తాన్ని స్పష్టంగా తెలిసి కూడా దానికి లోబడకపోవడం అనే "ఆత్మీయ నిద్ర" కు పోల్చవచ్చు. నీ జీవితంలో ఏర్పడిన ఆత్మీయ మత్తుకు కారణం ఇదేనా? దేవుడు ఎంతో కాలంగా ఫలానా పాపం గురించి నీతో మాట్లాడుతున్నాడు. "అది పరిశుద్ధులకు తగదు" అని ఎఫెసి 5:3లో చెప్తున్నాడు. దానికి నీవు లోబడలేదు. దాని పర్యవసానమే ఈ ఆత్మీయ నిద్ర.

#### బి) సంసోను నిద్ర (న్యాయా 16:19)

సంసోను మనందరికీ చిరపరిచితం. న్యాయాధిపతిగా వుండాల్సిన వ్యక్తి, ఇశ్రాయేలు ప్రజలను పరిపాలించవలసిన వాడు ఒక వేశ్య తొడ మీద నిద్రపోతున్నాడు. దేవుడు అనేకమారులు హెచ్చరించినా వినలేదు.

సహోదరుడా, సహోదరీ నీ "ఆత్మీయ నిద్రకు'' కారణం లైంగిక పాపమా? మనోనేత్రాలు మూసుకుపోతే, విశ్వాసి భౌతిక నేత్రాలు లైంగిక పాపాన్ని వెతుకుతాయి.

సంపోను నిద్రను విశ్వాసుల జీవితంలో కామవాంఛ వలన వచ్చిన ఆత్మీయ మత్తుకు పోల్చవచ్చు.

**సి) ఐతుకు అనే యౌవనస్తుని నిద్ర (అపో. కార్య 28:9)**

త్రోయ అనే పట్టణంలో విశ్వాసులనుద్దేశించి పౌలు ప్రసంగిస్తుండగా, ఐతుకు అనే యౌవనస్తుడు మూడవ అంతస్థు కిటికిలో కూర్చొని వింటూ నిద్రాభారం వలన తూలి క్రింద పడిపోయి చనిపోయాడు. ఈ ఘటనను గమనించినప్పుడు, ఆ యువకుడు కూర్చున్న స్థలం ఎంత ప్రమాదకరమైనదో అర్థమవుతుంది. అతని ఒక కాలు బయట, మరొక కాలు కిటికి లోపల ఉంచి కూర్చొని ఉంటాడు.

ఈ ఘటన, రెండు పడవల మీద ప్రయాణం చెయ్యాలనుకున్న వ్యక్తులను సూచిస్తుంది. అంటే, ఒక వైపు లోకం, మరొక వైపు దేవుడు. ప్రియ విశ్వాసీ, లోకం మరియు దేవుడు రెండింటినీ కావాలనుకుంటే, నువ్వు నిరాశపడటం ఖాయం.

ఇక్కడ ప్రభువు లూకా 9:6లో చెప్పిన మాటలను జ్ఞాపకం చేసుకోవడం చాలా ముఖ్యం. "నాగటి మీద చెయ్యి పెట్టి వెనుక తట్టు చూచు వాడెవడును దేవుని రాజ్యమునకు పాత్రుడు కాదు". నీ దృష్టి దేని మీద ఉంది? లోకం మీదా లేక దేవుని మీదా? ఈ రోజే ఒక నిర్ణయం తీసుకో. లోకంతో రాజీపడిన జీవితం అనే మత్తు నుండి బయటకు రా!

**డి) పేతురు నిద్ర (మత్తయి 26:40,41)**

ప్రభువుతో కూడా ప్రార్థన చేయలేని పేతురు, శోధన వచ్చినప్పుడు నిలబడలేక ఆయనను తృణీకరించాడు. మన ఆత్మీయ నిద్రకు ప్రార్థన లేమి కూడా ఒక ప్రధాన కారణం కావచ్చు.

ప్రార్థన చేయకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. వాటిలో అతి ముఖ్యమైనది గర్వం. "నేను చెయ్యగలను", "నా జ్ఞానం సరిపోతుంది", "నా ప్రణాళిక ఉత్తమం", "నా పద్ధతులు సరైనవి", "నా శక్తియుక్తులు నాకు సహాయపడతాయి" అనుకునే వారు ప్రార్థనలో దేవుని మీద ఆధారపడరు. ప్రార్థనా లేమి నీ ఆత్మీయ నిద్రకు కారణమా? ఆలోచించు!

## ఆత్మీయ నిద్ర నుండి మేలుకో!

ఆత్మీయ నిద్ర అనేది మన ఆధ్యాత్మిక జీవితంలో ఒక ప్రమాదకరమైన స్థితి. ఇది మనలను దేవునితో ఉన్న సంబంధం నుండి దూరం చేస్తుంది మరియు మనం ఆయన కోసం ప్రకాశించకుండా చేస్తుంది. ఈ నాలుగు కారణాలే కాక ఇంకా అనేక కారణాలు ఆత్మీయ నిద్రకు దారితీస్తాయి. కానీ, ఏ ఆత్మీయ నిద్ర నిన్ను దేవుని కోసం ప్రకాశించకుండా చేస్తుంది.

దేవుడు ఈ విషయం గురించి మనకు ఒక హెచ్చరికను ఎఫెసీ 5:14లో ఇస్తున్నాడు: "అందుచేత నిద్రించుచున్న నీవు మేల్కొని మృతులలో నుండి లెమ్ము, క్రీస్తు నీ మీద ప్రకాశించుచున్నాడు".

నీ చుట్టు చాలామంది మృతులు ఉన్నారు. వారికి నీలో ఉన్న జీవపు వెలుగును ప్రకాశింప చేసి, వారిని సజీవులుగా చేయవలసిన ఒక గొప్ప బాధ్యత నీ మీద ఉంది. నీవు ఆత్మీయ మత్తులో ఉంటే ఎవరు సువార్త ప్రకటిస్తారు? ఎవరు వారి కోసం ప్రార్థన చేస్తారు?

దేవుని రాజ్యం నిద్రపోయేవారికి కాదు. ఆయన నీ మీద ప్రకాశించి, మళ్ళీ నిన్ను వెలిగించడానికి ఇష్టపడుచున్నాడు. కాబట్టి, నీ ఆత్మీయ మత్తు నుండి లేచి బయటకు రా!

దేవుని చిత్తం స్పష్టంగా ఎరిగి కూడా దానికి లోబడవా? కాయవాంఛ నీ కన్నులను లోబరచు కుందా? లోకంతో రాజీపడ్డావా? ప్రార్థనా లేమి నీ ఆత్మీయ జీవితాన్ని బలహీనపరచిందా?

ఈ రోజే ప్రభువు దగ్గర నీ పాపాన్ని ఒప్పుకొని, ఈ ఆత్మీయ మత్తులో నుండి బయటకు వచ్చి, దేవుని కోసం జ్యోతిలాగా ప్రకాశించు (ఫిలిప్పీ 2:14,15).

**– దేవిడ్ రాజ్ కుమార్, గుంటూరు**

(వెస్ట్ తెలంగాణ రెగ్‌కాన్ 2024 డివోషన్)

RECGON 2024


















## చిన్నవే కానీ













క్రైస్తవ ట్రాక్ట్‌లు, చిన్నవే కానీ, అపారమైన ప్రభావాన్ని చూపుతాయి. అందులోని సమాచారం హృదయాలను తాకి, జీవితాలను మార్చగల శక్తిని కలిగి ఉంటాయి. జీవితంలో ఎదుర్కొనే వివిధ సవాళ్లు, కష్టాలను ఎలా అధిగమించాలో, దైవ సహాయాన్ని ఎలా పొందాలో అవి సులభంగా వివరిస్తాయి. అంతేకాకుండా, జీవితంలో అర్థం, ఆనందం, శాంతిని కనుగొనేందుకు ఈ ట్రాక్ట్‌లు మార్గదర్శకంగా నిలుస్తాయి. తెలుగు, ఇంగ్లీషు భాషలలో రూపొందించబడిన ట్రాక్ట్‌లు మరియు క్రిస్మస్ ట్రాక్ట్‌లు, ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా సరళమైన భాషలో రూపొందించబడతాయి. రాష్ట్ర కార్యాలయంలో ఈ ట్రాక్ట్‌లు లభ్యమవుతున్నాయి. దీనికి సంబంధించి **బ్రదర్ సాయి కుమార్** (7993397630), **బ్రదర్ జీవన్ కుమార్** (9000086297) మరియు **రీజినల్ మెంబర్స్**ను సంప్రదించగలరు.

– **వి. రాజేంద్ర ప్రసాద్,** సెక్రటరీ
యుఇయస్ఐ పిటి తెలంగాణ బ్రాంచ్
సెల్ – 9951383091



# అంతరంగ సౌందర్యం

రమ్య చాలా తెలివైనది, చురుకైనది. కానీ కాస్త నల్లటి ఛాయ కలిగి, పొట్టిగా, బొద్దుగా ఉంటుంది. ఇంటర్ చదువుతున్న రమ్యను ఆమె స్నేహితులు "బ్లాక్ బ్యూటీ" అని పిలుస్తారు. ఇది అంతరంగంలో రమ్యను బాధపెడుతుంది. ఇతరులతో పోల్చుకుంటూ, తన నల్లని చర్మాన్ని గురించి ఆమె ఎప్పుడూ కుమిలిపోతూ ఉంటుంది. "నేను బ్లాక్‌గా ఉన్నాను, నా స్నేహితులు నన్ను ఇలాగే పిలుస్తున్నారు" అని ఆమె మనసులో బాధపడుతుంది.

రాహుల్ చూడడానికి అందంగా ఉన్నాడు. అయితే, అతను పొట్టిగా ఉంటాడు. తనకేమో పొడుగ్గా ఉండాలని అతని మనసులో ఎల్లప్పుడూ ఆశ ఉంటుంది. మిగతావారితో తనను పోల్చుకుంటూ, తన పొట్టితనాన్ని గురించి రాహుల్ బాధపడుతుంటాడు.

### బాహ్య సౌందర్యం వర్సెస్ అంతరంగ సౌందర్యం: ఏది నిజమైన సౌందర్యం?

నిజానికి, "బహిరంగ సౌందర్యం" అనేది ఎంతో ఆకర్షణీయమైన విషయం. అయితే, ప్రతి ఒక్కరికీ ఎక్కడో ఒక దగ్గర కొంత లోపం ఉంటుందనేది నిజం. బహిర్గత సౌందర్యముపై మనం ఎంత దృష్టి పెట్టినా, వయసు మీద పడుతున్న కొద్దీ చర్మముపై ముడతలు రావడం, మచ్చలు రావడం సహజమే. మనం తినే ఆహారం, వాతావరణంలోని మార్పులు మన శరీరంలో అనేక మార్పులకు కారణం అవుతాయి. ఉదాహరణకు, చిన్న వయసులోనే వెంట్రుకలు రాలిపోవడం, తెల్లగా మారడం వంటివి గమనించవచ్చు.

### బాహ్య సౌందర్యం: ఒక సహజ ప్రక్రియ

మనం ఎంత శ్రద్ధ తీసుకున్నా లేదా తీసుకోక పోయినా, బహిరంగ సౌందర్యం రోజురోజుకు

వాడిపోతుంది. ఇది ఒక సహజ ప్రక్రియ మరియు దీనిని అంగీకరించడం ముఖ్యం. మనం బాహ్య సౌందర్యాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నించవచ్చు, కానీ అది నిరంతరం మనతో ఉండదని గ్రహించడం కూడా అంతే ముఖ్యం.

మనలో చాలామంది బాహ్య సౌందర్యానికి అతిగా ప్రాధాన్యతనిస్తూ ఉంటారు. ఇది మనలో ఉన్న తెలివితేటలను, సహజ సామర్థ్యాలను మరుగున పడేస్తుంది. పైరూప సౌందర్యంపై అతిగా ధ్యాస పెట్టడం వల్ల మన సమయం, శక్తి వృథా అవుతాయి. ఇలాంటి వాటిపై అతిగా శ్రద్ధ వహించడం ఐహిక విచారాలకు దారి తీస్తుంది.

### అంతరంగ సౌందర్యం: నిజమైన అందం

మనిషి నిర్మాణాన్ని పరిశీలిస్తే, అతను శరీరం, మనస్సు, ఆత్మల సమ్మేళనం అని తెలుస్తుంది. కేవలం పైరూపం అనగా శరీరంపైనే ధ్యాస పెట్టితే, మిగిలిన మనస్సు, ఆత్మ అభివృద్ధి చెందవు. మానసిక, ఆధ్యాత్మిక అభివృద్ధి కూడా చాలా ముఖ్యం.

అంతరంగ సౌందర్యం అనేది మన వ్యక్తిత్వం, మనస్సు, హృదయం మరియు ఆత్మతో అవినాభావంగా అల్లుకుపోయి ఉంటుంది. ఒక వ్యక్తి బాహ్యంగా ఎంత అందంగా ఉన్నా, అంతరంగంలో సానుకూల దృక్పథం, మంచి వైఖరి లేకపోతే, ఆ అందమైన ముఖంపై వికారం, విచారం కనిపిస్తాయి. మనం ఎవరినైనా చూసినప్పుడు, వారి ముఖంపై ఉన్న ఆనందం, ప్రశాంతత, మంచితనం అంతా వారి అంతరంగ సౌందర్యాన్ని ప్రతిబింబిస్తాయి.

### అంతరంగ సౌందర్యం యొక్క ప్రభావం

బాహ్యంగా అందంగా లేకపోయినా, అంతరంగంలో మంచి విలువలు, నమ్మకాలు, సానుకూల దృక్పథం, వైఖరి కలిగి ఉన్న వ్యక్తులు ఎల్లప్పుడు చిరునవ్వుతో, ఎంతో అందంగా కనిపిస్తారు. వారి మాటలు, ప్రవర్తన, చర్యల ద్వారా వారి అంతరంగ సౌందర్యం బయటపడుతుంది. అలాంటి వ్యక్తులు ఎవరినైనా ఆకర్షిస్తారు, వారి చుట్టూ సానుకూల వాతావరణాన్ని సృష్టిస్తారు.

ఈ అంతరంగ సౌందర్యం వ్యక్తి యొక్క ఆత్మీయ ప్రవర్తన మరియు దేవునితో మనకున్న సంబంధం ద్వారా ప్రకాశిస్తుంది. అంతరంగా సౌందర్యం అనేది అంతరంగంలో నుండి ప్రకాశిస్తూ, ఆకర్షిస్తుంది.

### అంతరంగ సౌందర్యం రోజు రోజుకూ ప్రకాశించాలంటే ఏమి చేయాలి?

మన అంతరంగ సౌందర్యం రోజురోజుకూ ప్రకాశవంతంగా ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. కానీ, దీనికి మనం ఏమి చేయాలి? మనం క్రీస్తును నమ్మినవారం కాబట్టి, ప్రతి విషయాన్ని బైబిల్ దృష్టికోణం నుండి చూడాలి. బైబిల్ అంతరంగ సౌందర్యం మరియు బాహ్య సౌందర్యం గురించి ఏమి చెబుతుంది?

"అందం వ్యర్థము, సౌందర్యము మోసకరము; యెహోవా యందు భయభక్తులు కలిగిన స్త్రీ కొనియాడబడను" (సామెతలు 31:30). ఈ వాక్యం నుండి స్పష్టమవుతున్నది ఏమిటంటే, నిజమైన అందం దేవుని యందు భయభక్తులు కలిగి ఉండడం వల్ల వస్తుంది.

### దేవుని యందు భయభక్తులు కలిగి ఉండటానికి మనం ఏమి చేయాలి?

దేవుని యందు నిజమైన భయభక్తులు కలిగి ఉండాలనే కోరిక మనలో ప్రతి ఒక్కరి హృదయంలో ఉంటుంది. అయితే, ఈ భయభక్తులు నిజంగా మన జీవితాలను ప్రభావితం చేయాలంటే, మనం కొన్ని ప్రాథమిక విషయాలను గ్రహించి, వాటిని అనుసరించాలి.

**1. మన వాక్యధ్యానాలు అర్థవంతంగా ఉండాలి**

మనం చదువుతున్న దేవుని వాక్యాన్ని గ్రహించడానికి, దానిలోని సత్యాలను మన హృదయాలలో నిక్షిప్తం చేసుకోవడానికి కొంత సమయం కేటాయించాలి. ఈ "క్వైట్ టైం" లేదా వ్యక్తిగత బైబిల్ అధ్యయనం (పిబియస్) ద్వారా, దేవునితో మన సంబంధం బలపడుతుంది మరియు

ఆయన మనలను ఎలా నడిపించాలను కుంటున్నాడో అర్థం చేసుకోవడానికి సహాయ పడుతుంది.

**2. ప్రార్థన ద్వారా దేవునితో మాట్లాడాలి**

ప్రార్థన అనేది దేవునితో మనం మాట్లాడే ఒక మార్గం. మనం మన హృదయాలను ఆయన ముందు తెరచి, మన ఆలోచనలు, భావనలు, మరియు కోరికలను ఆయనకు చెప్పాలి. అలాగే, ఆయన మనకు ఏమి చెప్పాల నుకుంటున్నాడో వినడానికి సిద్ధంగా ఉండాలి.

**3. దేవుడు మనతో మాట్లాడినప్పుడు, వెంటనే విధేయత చూపించాలి**

దేవుడు మనకు మార్గదర్శనం ఇచ్చినప్పుడు, ఆయన వాక్యాన్ని అనుసరించడం చాలా ముఖ్యం. విధేయత చూపించడం ద్వారా, మనం దేవునితో మన సంబంధాన్ని బలపరుచుకుంటాం, మరియు ఆయన ఆశీర్వాదాలను స్వీకరిస్తాం.

**4. దేవుడు మన మనసులను, హృదయాలను రూపాంతరం చేయడానికి అనుమతించాలి**

రోమా 12:2లో చెప్పినట్లుగా, దేవుడు మన మనసులను, హృదయాలను తన చిత్తానికి అనుగుణంగా మార్చాలనుకుంటున్నాడు. మనం ఆయనకు అనుమతి ఇచ్చినప్పుడు, ఆయన మనలో క్రొత్త వ్యక్తిత్వాన్ని రూపొందిస్తాడు.

**5. సహవాసాన్ని కలిగి ఉండాలి**

సహోదరులతో కలిసి దేవుని వాక్యాన్ని అధ్యయనం చేయడం, ఒకరినొకరు ప్రోత్స హించుకోవడం, దేవుని కలిసి ఆరాధించడం మన భయభక్తులను పెంపొందించుకోవడానికి ఎంతో సహాయపడుతుంది.

**6. మనకు ఒక మెంటార్ ఉండాలి**

మనం ఆధ్యాత్మికంగా పెరగడానికి మరియు దేవుని యందు భయభక్తులు కలిగి ఉండటానికి, మనకు ఒక మెంటార్ అవసరం.

## మన మనస్సును బలపరుచుకోవడం: ఒక నిరంతర అభ్యాసం

మన మనస్సును ఎప్పటికీ ఒక విద్యార్థిగా, కొత్త విషయాలను నేర్చుకుంటూ ఉంచుకోవడం చాలా ముఖ్యం. మానసికంగా బలంగా ఉండాలంటే, నిరంతర వ్యాయామాలు అవసరం. ఉదయం లేదా సాయంకాలం వ్యాయామం చేయడానికి ప్రత్యేక సమయాన్ని కేటాయించుకోవడం మంచిది. ఇది మన శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహాయపడుతుంది. అంతే కాకుండా, మన మనస్సును ఆధ్యాత్మికంగా బలపరుచుకోవడానికి కూడా కొన్ని విషయాలు చాలా అవసరం.

**1. సున్నితమైన మరియు నిశ్శబ్ద ఆత్మ (1 పేతురు 2:4)**

మన హృదయం లోపల సాధుత్వం, మృదుత్వం లాంటి గుణాలను పెంపొందించుకోవాలి. ఇది మనకు అక్షయమైన అలంకారాన్ని అందిస్తుంది.

**2. హృదయ శుద్ధి గలవారు ధన్యులు వారు దేవుని చూచెదరు (మత్తయి 5:8)**

మన హృదయాన్ని శుద్ధి పరచుకోవడం ద్వారా దేవుని సన్నిధికి చేరుకోవచ్చు.

**3. ప్రభువు మహిమను ప్రతిబింబించేలా మన జీవితాన్ని గడపాలి (2 కొరింథీ 3:16)**

ఈ భూలోకములో కూడా మనము ముసుకులేని ముఖములో ప్రభువు యొక్క మహిమను అద్దము వలె ప్రతిఫలింపజేయుచు, మహిమ నుండి అధిక మహిమను పొందుచు, ప్రభువు ఆత్మచేత ఆ పోలికగానే మార్చబడుచున్నాము. మనం ప్రభువు మహిమను ప్రతిబింబించేలా మన జీవితాన్ని గడపాలి. ఆయన ఆత్మ ద్వారా మనం మార్పు చెందుతూ మరింత మహిమను పొందుతాం.

**4. అంతరంగ సౌందర్యం (గలతీ 5:22-23)**

అంతరంగ సౌందర్యం అనేది దేవుని సహాయంతో ఆత్మ ఫలమైన ప్రేమ, సంతోషం, సమాధానం, దీర్ఘశాంతం, దయాళుత్వం, మంచితనం, విశ్వాసం, సాతిక్వం, ఆశానిగ్రహముల చేత ఏర్పడుతుంది. ఈ ఫలాలు మనకు అంతరంగ సౌందర్యాన్ని అందిస్తాయి.

**5. నీవు భయభక్తులు కలిగి ఉండుట అనేది వినయమునకు ప్రతిఫలం (సామెతలు 22:4)**

దేవుని పట్ల భయభక్తులు కలిగి ఉండటం

వల్ల మనలో వినయం అనే గుణం పెరుగుతుంది.

ఈ విషయాలను మన జీవితంలో అమలు చేసుకోవడం ద్వారా మన మనస్సును బలపరుచుకోవచ్చు, మానసికంగా ధృడంగా ఉండవచ్చు. దేవుని దయతో మన జీవితాలను మరింత అర్థవంతంగా, సంతోషంగా గడపవచ్చు.

**నీలో అంతరంగా సౌందర్యం ప్రకాశిస్తుందని ఎలా తెలుస్తుంది?**

చిరునవ్వు, దయగల హృదయం, సాధువైన స్వభావం, చురుకైన మనసు మరియు మంచి వైఖరి ద్వారా అంతరంగ సౌందర్యం బయట పడుతుంది.

**అంతరంగ సౌందర్యం కంటే బాహ్య సౌందర్యం ఎందుకు ప్రాముఖ్యం?**

1. **ఇది నీ క్రియల ద్వారా, ప్రవర్తన ద్వారా ప్రకాశిస్తుంది**
   నీ చర్యలు, నీ మాటలు, నీ ప్రవర్తన అన్నీ అంతరంగ సౌందర్యాన్ని ప్రతిబింబిస్తాయి.
2. **సానుకూల సంబంధాలను, అనుభవాలను కలిగి ఉంటుంది**
   అంతరంగ సౌందర్యం ఉన్న వ్యక్తులు మంచి సంబంధాలను ఏర్పరుచుకుంటారు, మరియు సానుకూల అనుభవాలతో నిండి ఉంటారు.
3. **వ్యక్తిలోని ఆత్మ విశ్వాసం, వారు ఎంత విలువైన వారన్నది తెలియపరుస్తుంది**
   అంతరంగ సౌందర్యం ఉన్న వ్యక్తికి ఆత్మ విశ్వాసం ఎక్కువగా ఉంటుంది. వారి చర్యలు మరియు ప్రవర్తన వారి విలువను తెలియ జేస్తాయి.
4. **నీలో ఉన్న అంతరంగ స్వభావం ఇతరులను ఆకర్షిస్తుంది**
   నీ అంతరంగ స్వభావం, నీ మంచితనం, నీ సానుకూలత ఇతరులను ఆకర్షిస్తాయి.
5. **దీనికి సరైన సమయం, వయసు అనేది ఉండదు**
   ఏ వయసులోనైనా అంతరంగ సౌందర్యాన్ని పెంపొందించుకోవచ్చు. ఏ వయసులోనైనా చక్కటి ఆత్మ సౌందర్యాన్ని కలిగి ఉండ వచ్చు.

**ముగింపు**

బాహ్య సౌందర్యం ఎంత అందంగా ఉన్నా, దేవుడు మనల్ని ఈ భూమి మీదకు ఒక మంచి ఉద్దేశంతో పంపాడు కాబట్టి, మనం అతిగా భౌతిక రూపంపై ధ్యాస పెట్టితే ఆ ఉద్దేశాన్ని కోల్పోతాం. దేవుడు మన కోసం తలపెట్టిన పనులు చేయకుండా మన జీవితాన్ని వృధా చేసుకుంటాం.

అతిగా భౌతిక రూపంపై దృష్టి పెడితే అది అనేక ఐహిక విచారాలకు దారి తీస్తుంది. కొన్ని సార్లు మన బాహ్య సౌందర్యం ఇతర స్త్రీలలో ఈర్ష్య, అసూయను కలిగించవచ్చు, అలాగే పురుషులను ఆకర్షించవచ్చు. కాబట్టి, బాహ్య స్వభావంపై అతిగా ధ్యాస పెట్టకూడదు.

అంతర్గత సౌందర్యమే అసలైన సౌందర్యం. అది దేవునితో మనకున్న సంబంధాన్ని, ఆయనను గౌరవించి జీవించాలనే మన నిబద్ధతను, ఒక వ్యక్తి యొక్క నిజమైన స్వభావాన్ని ప్రతిబింబిస్తుంది మరియు అదే వారిని నిజంగా అందంగా చేస్తుంది.

**– డా.ఎం.రాంబాబు, సుచిత్ర**
**నిజామాబాద్ జోన్–2**

* * * * * *

## శుభాకాంక్షలు

నిర్మల్ జిల్లా డీఎస్సీలో ఉపాధ్యాయుల పోస్టులకు సిస్టర్ వసంత జాన్ వెస్లీ మరియు సిస్టర్ సుజాత ఎంపికయ్యారు. ఇద్దరు కూడా ఎస్.ఏ బయలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులుగా నియమితులయ్యారు.


సిస్టర్ వసంత జాన్ వెస్లీ


సిస్టర్ సుజాత



కథానిక

# ఆధ్యాత్మిక స్థైర్యం

"ఈ వంకాయలు ఎంతకు తెచ్చావు?" అని అమ్మ అడిగింది. "సరిగ్గా గుర్తు లేదమ్మా!" అని నేను మొబైల్ చెక్ చేస్తూ సమాధానం చెప్పాను. "కనీసం కిలో యాభై అరవై ఉంటుంది. అన్నీ పుచ్చిపోయాయి. పుచ్చి పోయినవి తీసేస్తే కనీసం చారెడు ముక్కలు కావు ఇవి. ఏందబ్బీ యాడికిపోయినా ఇంతేనా? నువ్వేమి చిన్న పిల్లాడివి కావు. వయసుకు తగ్గ జ్ఞానం, తెలివి లేకపోతే ఎట్లా బతుకుతావు. ఎప్పుడూ చూసిన ఆ మొబైల్లో కళ్ళప్పగించి చూస్తూంటావ్. ఏ ముందంతగా దాంట్లో?" అంది అమ్మ.

నీ మాటలు అసలు ఒకటి కూడా వాడి చెవికెక్కడం లేదు. "చాలా బిజీగా ఉన్నాడు ఫోన్లో" అన్నాడు నాన్న.

అమ్మా నాన్న మాటలు నా చెవిలో బడుతున్నా మొబైల్ నా చేతిలో ఉండడం ఏమి సమాధానం చెప్పలేకపోయాను వాళ్ళకి.

అమ్మా, నాన్నలే కాదు, ఈ మధ్య ఫ్రెండ్స్ కూడా "వయసుకు తగ్గ మెచ్యూరిటీ లేదురా నీ దగ్గర'' అన్న సందర్భాలు ఉన్నాయి. పుచ్చిపోయిన, పాడైపోయిన కూరగాయలు తేవడం తప్ప, కాలేజీలో, క్లాసులో అమ్మాయిలను చూడడం, వెకిలిగా ఉండడంలో ఏం మెచ్యూరిటీ ఉందని అనుకుంటున్నారు? "నాకు మెచ్యూరిటీ లేదంటారు వాళ్ళు" అని కాస్త కోపం, ఉక్రోషం కలిగాయి. అమ్మా నాన్న దృష్టిలో మొబైల్ చూడడం తప్పు. క్యాంపస్‌లో అమ్మాయిలను చూడకపోవడం తప్పు వాళ్ళ దృష్టిలో.

"అసలు మెచ్యూరిటీ అంటే ఏమిటి?" అని బాధగా అనుకున్నాను.

మనసు కాస్త గజిబిజిగా, గందరగోళంగా ఉంది కాబట్టి ఇంటి వెనుక ఉన్న చెట్టు కింద ఒక కుర్చీ వేసుకొని, పూల మొక్కలను చూస్తూ, శ్రావ్యమైన దేవుని పాటలు వింటూ కళ్ళు మూసుకొని ఆలోచిస్తూ వున్నా. ప్రతి చిన్న విషయానికి తిట్టే అమ్మనాన్నలు, తమాషా చేస్తూ ఆట పట్టించే స్నేహితుల జోకులు... రోడ్డు పైనా తిరగే వాహనాల రణగొణ ధ్వనులకు దూరంగా, ప్రశాంతంగా ఎవరో ఏదో చెప్తున్నట్లు చదివిన వాక్యాలు, క్వయిట్ టైం గుర్తొచ్చాయి.

హఠాత్తుగా యోబు గురించిన విషయాలు గుర్తొచ్చాయి. నిజంగా ఆ మనిషికి ఎంత పరిపక్వత! ఓదార్చే వారే లేరు. నమ్ముకున్న స్నేహితులు, కట్టుకున్న భార్య అందరూ శోధించినా, ఎలాంటి ఆధ్యాత్మిక త్రోటుపాటు లేకుండా స్థిరంగా ఉన్నాడు. యోబు తన శ్రమల్లో సైతం కృపకు పాత్రుడిగా ఉండాలని కోరుకున్నాడు. తమ కడుపున పుట్టిన బిడ్డలు ఒకరు మరణిస్తేనే తట్టుకోలేరు ఎవరు. పుట్టిన

కొడుకులు, కూతుళ్ళు ఒకే రోజున మరణించారన్న వార్త విని కూడా ఏ విషయములోనూ దేవుడు అన్యాయం చేశాడని చెప్పలేదు. యథార్థతనూ వదలలేదు. ఎంత నిబ్బరం! ఎంత పరిపక్వత! తన ఆస్తులన్నీ ఒక్క రోజులోనే ధ్వంసమైనా చలించలేదు.

"యెహెూవా ఇచ్చెను యెహెూవా తీసికొనెను దేవుని నామమునకే స్తుతి కలుగును గాక" అని చెప్పడానికి ఎంత దమ్ముండాలి! ఈ రోజుల్లో ఎవరుండారబ్బ ఇంతటి వాళ్ళు? అన్నీ ఉండి ఏదో ఒకటి తక్కువైతేనే సహించలేక దేవుడు మాకు అన్యాయం చేశాడంటారు. నామట్టుకైతే కాస్త ఓర్పు కూడా లేదు. ప్రతిదానికి చింతపడ్డమే, బాధపడ్డమే. నన్ను చూసే, చూసుకొనే దేవుడుండాడు అని గుర్తేరాదె? చదువయ్యాక నా భవిష్యత్తు ఏమవుతుందో అనే భయం. దేవా! ఏ కొరతలేని ఆధ్యాత్మిక, ఆత్మీయ స్థైర్యం నాకివ్వు అన్నాను చిన్నగా.

"తల్లియైన మరచునేమో నేను మరువను నిన్ను నేను మరువను" అనే శ్రావ్యమైన పాట నా హృదయాన్ని నిబ్బరపర్చింది. పరిశుద్ధాత్ముని చల్లని స్వరంతో నా మనసు సేదదీరింది.

– చేగూడి శ్యామలా కృపారావ్,
టీచర్ మరియు గ్రాడ్యుయేట్, ఎ.జి జోన్

* * * * * *

# అద్భుతమైన అవకాశం!

దేవుడు మీకిచ్చిన తలాంతులను ప్రదర్శించేందుకు ఎదురుచూస్తున్నారా? అయితే, ఆడియో విజువల్ డిపార్ట్‌మెంట్, తెలంగాణ మీ కోసమే పాటల పోటీని నిర్వహిస్తోంది! వెస్ట్ తెలంగాణ ఇయు, ఇజియఫ్ నుండి ఉత్సాహవంతులైన గాయనీ గాయకులను ఆహ్వానిస్తుంది. సంగీతం ద్వారా ఆయనను మహిమపరచడానికి దేవుడు మీకు ఇచ్చిన ప్రతిభను ఉపయోగించుకోవడానికి ఇది మంచి అవకాశం.






ఈ అద్భుతమైన అవకాశాన్ని కోల్పోకండి!

**పోటీ వివరాలు**

1. మొదటి రౌండులో మీరు ఏ పాటనైన ఎంపిక చేసుకోవచ్చు (విద్యార్థి గీతావళి పాటలు తప్పనిసరి కాదు).
2. రెండవ రౌండ్‌లో, పోటీదారులు న్యాయ నిర్ణేతల చాయిస్ అనుసరించి పాడవలసి వుంటుంది.

**మరిన్ని వివరాలకు**

జి.గంగారావు, సెక్రటరీ, ఆడియో విజువల్ డిపార్ట్‌మెంట్ – 9989951895
వీరేశం, మెంబర్ – 8978383150

## భారతదేశంలో మహిళా విద్యకు మార్గదర్శకురాలు

# ఇసాబెల్లా థోబర్న్

## (1840-1901)



ఇసాబెల్లా థోబర్న్ అమెరికా దేశానికి చెందిన మెథడిస్ట్ ఎపిస్కోపల్ చర్చివారిచే భారతదేశానికి పంపబడిన క్రైస్తవ మిషనరీ. భారతదేశంలో మహిళల విద్యకు ఆమె చేసిన కృషి అద్వితీయమైనది. భారతదేశంలో మొదటి బాలికల పాఠశాలను స్థాపించిన ఘనత ఆమె సొంతం. ఈస్టిండియా కంపెనీ నిష్క్రమణ తరువాత, బ్రిటీష్ ప్రభుత్వం యొక్క ప్రత్యక్ష వలస పాలనలో ఉత్తర భారతదేశంలో విద్యాసంస్థలను మరియు మిషనరీ పనిని విజయవంతంగా నిర్వహించింది. మిషనరీగా మరియు విద్యావేత్తగా, ఆ దినాలలో భారతదేశంలోని స్త్రీలు సమాజంలో అనేక రంగాలలో ప్రతిఘటనను ఎదుర్కొంటున్న సమయంలో మహిళలకు విద్యా అవకాశాలను రూపొందించడంలో ఆమె ప్రారంభించిన కార్యాక్రమాలు ఎంతో కీలకమైనవి. భారతదేశంలో మహిళల విద్యకై ఆమె చేసిన సేవలు మరువలేనివి.

### బాల్య జీవితం మరియు కుటుంబ నేపథ్యం

థోబర్న్, ఐర్లాండ్ నుండి అమెరికా దేశానికి వలస వచ్చిన తల్లిదండ్రులకు ఓహాయోలోని సెయింట్ క్లైర్స్‌విల్లేలో మార్చి 29,1840న జన్మించారు. స్త్రీలు ఎక్కువగా దేశీయ రంగాలకే పరిమితమైన కాలంలో, ఒక భక్తి గల మెథడిస్ట్ కుటుంబంలో పెరిగిన ఆమె ఉన్నత విద్యను అభ్యసించడానికి ప్రోత్సహించబడింది. ఇది ఆమె కాలంలోని మహిళలకు చాలా అసాధారణమైన విషయం. మిచిగాన్ విశ్వ విద్యాలయం నుండి పట్టభద్రురాలయ్యాక, థోబర్న్ మిషనరీగా సేవ చేయాలనే దేవుని పిలుపుకు లోబడి, భారతదేశానికి మిషనరీగా వెళ్లాలని నిశ్చయించుకుంది.

అప్పటికే భారతదేశంలో మెథడిస్ట్ ఎపిస్కోపల్ మిషనరీగా ఉన్న ఆమె సోదరుడు జేమ్స్ మిల్స్ థోబర్న్ తన విద్యా మరియు మిషనరీ పనిలో సహాయ పడటానికి తన సహోదరి ఇసాబెల్లాను భారతదేశానికి తీసుకురావడానికి బాధ్యత వహించాడు. భారతదేశం వంటి వెనుకబడిన దేశంలో తన సోదరి యొక్క అనేక సంవత్సరాల బోధనా అనుభవాన్ని ఉపయోగించు కోవచ్చని అతను భావించాడు.

సామాజిక జీవితంలో నైతిక విలువలకు పెద్దపీట వేసే దైవభక్తిగల కుటుంబం నుంచి వచ్చిన ఇసాబెల్లా, సమాజానికి సేవ చేయడం జీవితంలో ఒక ముఖ్యమైన భాగమని, అన్నింటికీ

అతీతమైనదనే నిబద్ధతతో పెరిగారు. మెరుగైన సమాజం బలమైన దేశాన్ని నిర్మిస్తుంది అనేది వారి నమ్మకం. ఆమె కుటుంబం ఇచ్చిన ఈ నైతిక ఉపదేశంతో, ఆమె సోదరుడు జేమ్స్ మిషనరీగా భారతదేశానికి వచ్చాడు. సంప్రదాయ భారతీయ సమాజంలో స్త్రీల స్థితిగతులను తెలుసుకున్న ఆయన వారి జీవితాలను మెరుగుపరచాలనే తీవ్రమైన కోరికను కలిగియున్నాడు. ఆయన ఉద్దేశం, స్త్రీలలో నీతివంతమైన జీవితాన్ని గడపాల నే ఆశను, సంకల్పాన్ని పెంపొందించడం. అలాగే, వారి అంతర్లీన సామర్థ్యాన్ని గుర్తించడం మరియు వారి అజ్ఞానాన్ని పారద్రోలడం ఆయన లక్ష్యాలు.

మొదటగా విద్య విషయమై భారతీయ మహిళలకు అవగాహన కల్పించడం ఉత్తమమైనదని అతడు భావించాడు. దురదృష్టవశాత్తు, తనకు అన్ని విధాలా అండగా నిలిచిన భార్య అకాల మరణంతో అతని కల చెదిరిపోయింది. భార్య వదిలేసిన పనులను తన సోదరి చేపడుతుందని ఆయన భావించాడు.

## భారతదేశానికి మిషనరీగా ప్రయాణం

1866లో, ఇసాబెల్లా థోబర్న్ సోదరుడు



జేమ్స్ థోబర్న్ తాము బాలికల కోసం పాఠశాల ను ప్రారంభించాలని యోచిస్తున్నట్లు, ఇసాబెల్లా కూడా వచ్చి ఉపాధ్యాయు రాలిగా బాధ్యతలను స్వీకరించాలని కోరాడు. దేవుడు తనకు మార్గం తెరిచిన వెంటనే వస్తానని ఆమె బదులిచ్చింది.

కానీ, అప్పటికాలంలో చర్చిలోని మిషనరీ సొసైటీ అవివాహిత స్త్రీలను విదేశాలకు పంపడానికి ఇష్టపడలేదు. అయితే, 1869లో బోస్టన్, మాసాచుసెట్స్‌లో, "ఉమెన్స్ ఫారిన్ మిషనరీ సొసైటీ ఆఫ్ ది మెథడిస్ట్ ఎపిస్కోపల్ చర్చ్" స్థాపించ బడినప్పుడు, వారు భారతదేశానికి ఇసాబెల్లా థోబర్న్‌ను మొదటి మిషనరీగా పంపడానికి అంగీకరించారు. ఆమెతో బాటు, డాక్టర్. క్లారా ఎ.స్వైన్‌ను మొదటి మహిళా మిషనరీ వైద్యురాలిగా నియమించారు. ఈ ఇద్దరు ఒంటరి మహిళలు నవంబరు 3, 1869న బోస్టన్ నుండి ప్రయాణం ప్రారంభించి, జనవరి 7, 1870న బొంబాయికి చేరుకున్నారు.

## భారతదేశంలో పయనీరింగ్ పరిచర్య

ఆమె పని జెనానాలలో (ఇంటిలోని ప్రత్యేక ప్రాంతంలో మహిళలను ఏకాంతంగా ఉంచే పద్ధతి) ఉన్న మహిళలను సందర్శించడం మరియు వారితో సువార్తను పంచుకోవడం ద్వారా ప్రారంభమైంది. అదనపు నిధులతో, ఆమె స్థలాలు మరియు భవనాలను కొనుగోలు చేసి లక్నో బజార్‌లో బాలికల కోసం ఒక పాఠశాలను ఏప్రిల్8, 1870లో ప్రారంభించింది.

అది ఒక చిన్న గది మాత్రమే అయినప్పటికీ, ఇసాబెల్లా హృదయం పెద్దది. క్లాసు రూమ్‌లోకి వెళ్లడానికి భయపడిన మొదటి ఏడుగురు అమ్మాయిలను ఒప్పించడానికి ఆమెకు కొంత సమయం పట్టింది. ఇంట్లో గడపాల్సిన స్త్రీకి చదువు నిషిద్ధం, పాపం అనే నమ్మకంతో వారి ని పెంచారు. ఒక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఆమె తరగతి గది ముందు ఒక క్లబ్‌లో గార్డును నియమించింది, తద్వారా అక్కడి నుండి ఎవరూ చొరబడి అమ్మాయిలను తీసుకెళ్లలేరు.

1871లో, మరికొంత మంది విద్యార్థులతో, ఆమె ఒకప్పుడు అవధ్ యొక్క నవాబ్ ఆక్రమించిన ఇంటి నుండి పనిచేయడం ప్రారంభించింది. అదే సమయంలో, ఆమె కాన్పూర్‌లో మెథడిస్ట్ ఉన్నత పాఠశాలను స్థాపించడానికి బాధ్యత వహించింది. ఈ రెండు విద్యా సంస్థలు వల సరాజ్య భారతదేశంలో మొట్టమొదటివిగా గుర్తింపు పొందాయి. అవధ్-లక్నో, అప్పటి ఉత్తరప్రదేశ్‌లో అభివృద్ధి చెందుతున్న ఆంగ్లో ఇండియన్ సమాజం యొక్క విద్యా మరియు మతపరమైన అవసరాల ను తీర్చాయి. చాలా సంవత్సరాలు ఆమె హింద్ రఫీక్-ఐ-నిస్వాన్, అంటే మహిళల స్నేహితురాలు అనే అర్థమిచ్చే మాసపత్రికకు సంపాదకత్వం వహించింది.

భారతీయ స్త్రీలు ఎదుర్కొంటున్న సామాజిక పరిమితులను అర్థం చేసుకున్న ఆమె, విద్యకు


ఉన్న అడ్డంకులను పరిష్కరించడానికి తనను తాను అంకితం చేసుకుంది. ఆమె తన సోదరుడు ఉన్న లక్నో నగరానికి కేటాయించబడి, అక్కడ భారతీయ మహిళల కోసం విద్యా కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇది ఆసియాలో మహిళల కోసం ఏర్పాటు చేయబడిన మొదటి క్రిస్టియన్ కళాశాలగా గుర్తించబడింది. ఆమె ఈ కార్యక్రమాన్ని ఏప్రిల్ 1870లో లక్నో బజార్‌లోని ఒక గదిలో ఆరుగురు అమ్మాయిలతో ప్రారంభించింది. కాలక్రమేణా ఇది బోర్డింగ్ స్కూల్‌గా అభివృద్ధి చెంది, తర్వాత ఉన్నత పాఠశాలగా విస్తరించింది.

మిస్ థోబర్న్ పాఠశాల 1886 జూలై 12న లక్నో మహిళా కళాశాలగా పేరు మార్చబడి, కలకత్తా విశ్వవిద్యాలయం పర్యవేక్షణలో ఫైన్ ఆర్ట్స్ తరగతులను బోధించడం ప్రారంభించింది. 1894లో అలహాబాద్ విశ్వవిద్యాలయం ఏర్పాటుతో దాని అనుబంధ విశ్వవిద్యాలయంగా మారింది. ఆమె గౌరవార్థం 1923లో కళాశాల పేరు ఇసాబెల్లా థోబర్న్‌గా మార్చబడింది. ఈ కళాశాల ఇప్పుడు విశాలమైన ప్రాంగణాన్ని (32 ఎకరాలు) కలిగి ఉంది, ఒకప్పుడు లక్నో నగరంలో చాంద్ బాగ్ (మూన్ గార్డెన్) అని పిలవబడే రాయల్ గార్డెన్ ఉంది. ఇప్పుడు ఇది లక్నో విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉంది.

### కళాశాలకై నిధుల సేకరణ

1880 నుండి 1881 వరకు, ఆమె సెలవుపై అమెరికా దేశానికి వెళ్ళింది. అనారోగ్యం కారణంగా, 1886 నుండి 1896 వరకు మళ్ళీ అమెరికాలోనే గడిపింది. ఈ కాలంలో, ఆమె మెథడిస్ట్ ఎపిస్కోపల్ చర్చిలో మొదటి డీకనెస్‌లలో ఒకరిగా మారింది. అలాగే, ఒక సంవత్సరం చికాగో ట్రైనింగ్ స్కూల్‌లోనూ, తర్వాత ఓహాయోలోని సిన్సినాటిలో లూసీ రైడర్ మేయర్‌తో కలిసి పని చేసింది.

ఆమె డీకనెస్ హోమ్ మరియు ట్రైనింగ్ స్కూల్, క్రైస్ట్ హాస్పిటల్‌ను నెలకొల్పడంలో కీలక పాత్ర పోషించింది. 1891లో, ఆమె కళాశాల కోసం నిధులను సేకరించింది. 1900లో, న్యూయార్క్‌లో జరిగిన ఎక్యుమెనికల్ మిషనరీ కాన్ఫరెన్స్‌లో మూడు ప్రసంగాలు చేసిన తర్వాత ఆమె భారతదేశానికి తిరిగి వచ్చింది.



## వారసత్వం మరియు గుర్తింపు

భారతదేశంలో స్త్రీల విద్య గురించి జరిగిన సమకాలీన చర్చలలో, ఇసాబెల్లా థోబర్న్ యొక్క రచనలలో, లింగ సమానత్వం కోసం ఆమె చేసిన పోరాటాన్ని గుర్తు చేస్తాయి. గణనీయమైన ప్రగతి సాధించినప్పటికీ, మహిళల విద్యకు సంబంధించిన సవాళ్లు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. నాణ్యమైన విద్యను పొందడం, మహిళల పాత్రల పట్ల సామాజిక వైఖరులు, ఆర్థిక అడ్డంకులు వంటి సమస్యలు మహిళల విద్యా అవకాశాలను ప్రభావితం చేస్తూనే ఉన్నాయి.

ఇసాబెల్లా థోబర్న్ స్త్రీలకు సంపూర్ణ విద్యనందించే విషయంపై ఎక్కువ ప్రాధాన్యతనిచ్చింది. ఆమె భారతదేశంలో మహిళలకు విద్యను అందిండానికి అనేక కళాశాలు మరియు విద్యా సంస్థల ను స్థాపించడంలో కీలక పాత్ర పాషించింది. సెప్టెంబర్ 1, 1901న కలరా వ్యాధితో ఆమె మరణించింది. ఆమె లక్నోలో సమాధి చేయబడింది. మరణానంతరం, ఆమె స్థాపించిన కళాశాలకు ఇసాబెల్లా థోబర్న్ కళాశాలగా పేరు మార్చారు, ఈ కళాశాల ఇప్పుడు లక్నో విశ్వవిద్యాలయంగా పిలువబడుతుంది.

మహిళల విద్యకు ఇసాబెల్లా థోబర్న్ చేసిన కృషి ఆమె మరణానంతరం గుర్తించబడింది. భారతదేశం మరియు అమెరికాలో ఆమె ఒక మార్గదర్శక వ్యక్తిగా పేరుగాంచింది. ఆమె వారసత్వాన్ని కొనసాగించ డానికి వివిధ సంస్థలు మరియు స్మారక చిహ్నాలు నెలకొల్ప బడ్డాయి. మహిళా విద్యను ప్రోత్సహించే లక్ష్యంతో స్కాలర్‌షిప్‌లు మరియు అవార్డులను అందిస్తున్నారు.

## ముగింపు

ప్రాచీన భారతదేశంలోని స్త్రీలు పురుషులతో సమాన హక్కులను అనుభవిస్తూ సమాజంలో ఉన్నతస్థానాన్ని కలిగి ఉండేవారు. వారు విద్యావంతులుగా ఉండి, తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే స్వాతంత్ర్యం కలిగి ఉండేవారు. అయితే, క్రమంగా చరిత్రలో, పురుషాధిక్యత వర్ధిల్లడంతో స్త్రీల పరిస్థితి గణనీయంగా మారిపోయింది. వారు "పుట్టినప్పుడు అవాంఛనీయమైనది, జీవితంలో గౌరవించబడదు, మరణంచినా చింతించనవసరం లేదు" అనే స్థాయికి నెట్టబడ్డారు.

ఈ దుస్థితిని గమనించి, ఇసాబెల్లా భారతీయ సమాజంలోని పేద మహిళల కోసం అవిశ్రాంతంగా శ్రమించింది. వారిలో ధైర్యాన్ని నింపి, వారి జీవిత లక్ష్యాలను అర్థం చేసుకునేలా ప్రోత్సహించింది. విద్య ద్వారా వారు జాతి నిర్మాణానికి అవసరమైన నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవచ్చని ఆమె భావించింది. భారతదేశమంతటా పర్యటిస్తూ, బాలికల కోసం మరిన్ని విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలని క్రైస్తవ మిషనరీ సంస్థలకు విజ్ఞప్తి చేసింది.

నేడు, భారతదేశమంతటా మహిళా కళాశాలలు మరియు విశ్వవిద్యాలయాల నిరంతర అభివృద్ధిలో ఆమె ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సంస్థలు ఆమె దూరదృష్టికి మరియు విద్య యొక్క పరివర్తన శక్తికి నిదర్శనాలు. థోబర్న్ జీవితం విద్యావేత్తలకు మరియు మహిళల అభ్యుదయం కోసం పోరాడేవారికి నేటికీ స్ఫూర్తినిస్తూనే ఉంది. మనం క్రీస్తు ప్రేమతో సామాజిక సవాళ్లను ఎదుర్కొని ప్రజాభ్యుదయానికి కృషి చేయాలని ఆమె జీవితం మనకు గుర్తుచేస్తుంది.

ఇసబెల్లా థోబర్న్ వంటి వ్యక్తుల కృషి ఫలితంగా, భారతీయ మహిళలు నేడు విద్యా, ఆర్థిక, సామాజిక రంగాలలో అభివృద్ధి చెందుతున్నారు. అయితే, మహిళలకు సమాన హక్కులు మరియు అవకాశాలు లభించేలా, లింగ వివక్షను నిర్మూలించే దిశగా మన కృషి కొనసాగాలి. ఇసబెల్లా థోబర్న్ జీవితం మనకు ఒక ప్రేరణ, మహిళల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేయాలని, లింగ సమానత్వాన్ని సాధించాలని ప్రోత్సహిస్తుంది.

**(పై వ్యాసం ఇంటర్నెట్ వనురుల నుండి సేకరించ బడినది)**

**– రూత్ వినయ్,**
**ప్రగతినగర్, హైదరాబాద్**



# ధైర్యంగా ఉందాం, భయాన్ని ఎదిరిద్దాం!

భయం అనేది ఒక సహజమైన భావోద్వేగం, ప్రమాదానికి మన మనస్సు ప్రతిస్పందించే విధానం. అది అసురక్షిత భావనను కలిగిస్తుంది. ఈ భయం ఎక్కువై, మన జీవితాలను నియంత్రించడం మొదలుపెడితే, అది మన ఆరోగ్యం, సంబంధాలు మరియు మొత్తం జీవితాన్ని ప్రభావితం చేస్తుంది.

అయితే, ఈ భావనను సాతాను మనకు వ్యతిరేకంగా ఉపయోగించుకునే ఒక సాధనంగా దేవుని వాక్యం వివరిస్తుంది.

## భయం - సాతాను యొక్క సాధనం

భయం అనేది సాతాను యొక్క ప్రధాన పథకాలలో ఒకటి. మనల్ని దయనీయంగా మార్చి, మన జీవితాలను నాశనం చేయడానికి ఇది ఒక శక్తివంతమైన సాధనం. దేవుడు మనల్ని విశ్వాసంతో, ధైర్యంతో జీవించమని కోరుతున్నాడు.

అయితే, సాతాను మనల్ని భయంతో బంధించి, దేవుని నుండి దూరం చేయాలని ప్రయత్నిస్తాడు. దేవుడు మనకు శక్తియు, ప్రేమయు, ఇంద్రియ నిగ్రహం గల ఆత్మనే ఇచ్చాడు; కాని పిరికితనం గల ఆత్మను ఇయ్యలేదు (2 తిమో 1:7).

## భయానికి కారణాలు

మనం ఎప్పుడు భయపడతాం? భయం ఎప్పుడు మనల్ని ఆవహిస్తుందనే దానికి అనేక కారణాలు ఉన్నాయి:

**ఎ) క్రీస్తులో మన గుర్తింపును మరచిపోయినప్పుడు**

మనం దేవుని పిల్లలమని, ఆయన ప్రేమలో నిలబడి ఉన్నామని మనం మరచి పోయినప్పుడు, మనం అసురక్షితంగా మరియు భయపడు తున్నట్లు అనిపిస్తుంది.

**బి) మన సామర్థ్యం కంటే ఎక్కువగా ఎదుర్కొన్నప్పుడు**

మనం ఒక కష్టమైన పరిస్థితిని ఎదుర్కొన్నప్పుడు, దానిని ఎదుర్కోనేందుకు మనం సరిపోమని అనిపించినప్పుడు భయం మనల్ని ఆవహిస్తుంది.

**సి) దేవుని యందు విశ్వాసం లేనప్పుడు**

మనం దేవునిపై విశ్వాసాన్ని కోల్పోయినప్పుడు, ఆయన మనల్ని కాపాడగలడని మనం నమ్మనప్పుడు, అనిశ్చితి మరియు భయం మనల్ని ఆవహిస్తాయి.

**డి) అనిశ్చిత, కొత్త పరిస్థితులు**

మనం అలవాటు లేని పరిస్థితుల్లోకి వెళ్ళినప్పుడు, మనకు తెలియని వాతావరణంలోకి ప్రవేశించినప్పుడు, భయం మనల్ని వేధించవచ్చు.

**ఇ) మన చుట్టూ ఊహించని పరిస్థితులు**

ఊహించని సంఘటనలు, ప్రమాదాలు, లేదా మనం నియంత్రించలేని పరిస్థితులు ఎదురైనప్పుడు భయం మనల్ని ఆవహించవచ్చు.

### ఎఫ్) ఆర్థిక అసమతుల్యత

ఆర్థికంగా అస్థిరత లేదా అనిశ్చితి ఉన్నప్పుడు, భవిష్యత్తు గురించి ఆందోళన చెందడం వల్ల భయం కలుగుతుంది.

## భయాలు మరియు వాటి రకాలు

కొన్ని భయాలు మనల్ని కాపాడుకోవడానికి సహాయపడగా, కొన్ని భయాలు మన జీవితాలను కష్టతరం చేస్తాయి. ఈ భయాలను అర్థం చేసుకోవడం, చాలా ముఖ్యం. భయాలను వివిధ రకాలుగా వర్గీకరించవచ్చు.

### ఎ) వ్యక్తిగత భయాలు

వ్యక్తిగత జీవితానికి సంబంధించిన భయాలు ఈ వర్గంలోకి వస్తాయి. ఇవి మన స్వంత ఆలోచనలు, అనుభవాలు, నమ్మకాలతో సంబంధం కలిగి ఉంటాయి. కొన్ని సాధారణ వ్యక్తిగత భయాలు:

* ఏదైనా చేయడంలో విఫలమవ్వడం వలన కలిగే భయం.
* భవిష్యత్తు గురించి తెలియకపోవడం వలన కలిగే భయం.
* వృద్ధాప్యం వల్ల కలిగే శారీరక, మానసిక మార్పుల గురించి కలిగే భయం.
* తనను తాను తక్కువగా అంచనా వేసుకోవడం వలన కలిగే భయం.
* ఒంటరిగా ఉండడం వలన కలిగే భయం.

### బి) వృత్తిపరమైన భయాలు

వృత్తి జీవితంలో ఎదురయ్యే సవాళ్ళు, అనిశ్చితుల వల్ల కలిగే భయాలు ఈ వర్గంలోకి వస్తాయి.

* చదువు, ఉద్యోగం లేదా వ్యాపారంలో ముందుకు సాగలేకపోవడం వలన కలిగే భయం.
* కొత్త సాంకేతికతలను నేర్చుకోవలసి వచ్చినప్పుడు కలిగే భయం.
* కొత్త పరిజ్ఞానాన్ని నేర్చుకోలేకపోవడం వల్ల పాత కాలపు వ్యక్తి అనిపించుకోవడం వలన కలిగే భయం.

### సి) ఆర్థిక భయాలు

ఆర్థిక పరిస్థితికి సంబంధించిన భయాలు ఈ వర్గంలోకి వస్తాయి.

* పేదరికంలో చిక్కుకోవడం వలన కలిగే భయం.
* అప్పుల భారం వలన కలిగే భయం.
* పదవీ విరమణ తర్వాత ఆర్థిక స్థితి గురించి కలిగే భయం.
* ద్రవ్యోల్బణం వలన కలిగే ఆర్థిక నష్టం గురించి కలిగే భయం.
* ఆర్థిక పరిస్థితిలో అనిశ్చితి వలన కలిగే భయం.

### డి) మానసిక భయాలు

మానసిక ఆరోగ్యం మరియు గుర్తింపుకి సంబంధించిన భయాలు ఈ వర్గంలోకి వస్తాయి.

* సమాజంలో తన గుర్తింపు కోల్పోవడం వలన కలిగే భయం.
* మానసిక అనారోగ్యం బారిన పడటం వలన కలిగే భయం.
* మద్యం, డ్రగ్స్ వంటి వ్యసనాల బారిన పడటం వలన కలిగే భయం.
* మరణం గురించి కలిగే భయం.

## భయం వలన పర్యవసానాలు

భయం అనేది మన జీవితాలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. అది మన ఆలోచనలు, ప్రవర్తన మరియు నిర్ణయాలను ప్రభావితం చేస్తుంది.

"భయపడుట వలన మనుష్యులకు ఉరి వచ్చును" (సామె 29:25) అనే వాక్యం భయం వలన కలిగే ప్రమాదాలను హెచ్చరిస్తుంది.

## భయాన్ని అధిగమించడానికి ఆచరణాత్మక మార్గాలు

భయం వల్ల మనం పనిచేయకపోవడం, నిర్ణయాలు తీసుకోకపోవడం లాంటి సమస్యలను ఎదుర్కొంటాము. దేవుని వాక్యం మనకు భయాన్ని అధిగమించేందుకు అనేక మార్గాలను చూపుతుంది. భయాన్ని అధిగమించ డానికి కొన్ని ఆచరణాత్మక మార్గాలను పరిశీలిద్దాం.

### ఎ) క్రీస్తులో మన గుర్తింపును తెలుసుకోవడం

మనం దేవుని సృష్టి, ఆయనకు ప్రియమైన వారమని తెలుసుకోవడం చాలా ముఖ్యం.

దేవుడు మన పేరు పెట్టి నిన్ను, నన్ను

పిలిచియున్నాడు. మనము ఆయన సొత్తు (యెష 43:1). మనము ఆయన స్వాస్థ్యం (కీర్త 33:12). మనం దేవునికి చెందినవారమని తెలుసుకున్నప్పుడు, మనం భయపడే అవసరం లేదు. ఎందుకంటే మనకు ఎల్లప్పుడూ ఒక పరమ తండ్రి ఉన్నాడు, ఆయన మనను ఎల్లప్పుడూ కాపాడుతాడు.

**బి) దేవుని వాక్యాన్ని అనుదినం ధ్యానించడం**

దేవుని వాక్యం మనకు అద్భుతమైన శక్తినిస్తుంది. దేవుని వాక్యం మనకు నెమ్మదిని, సంతోషాన్ని, ధైర్యానిస్తూ, మనలను స్థిరపరచి కొనసాగింప చేస్తుంది (కీర్త 119). దేవుని వాక్యాన్ని రోజూ చదివి, ధ్యానించడం ద్వారా మనం ఆయన ప్రేమను, శక్తిని అనుభవిస్తాం. భయం మన మనస్సును ఆక్రమించుకున్నప్పుడు, దేవుని వాక్యాన్ని ధ్యానించడం వల్ల అది తగ్గుతుంది.

**సి) దేవునిపై విశ్వాసం**

దావీదు, దానియేలు, షద్రకు, మేషాక్, అబేద్నెగోల వలె మన శక్తికి మించిన పరిస్థితులను ఎదురుకుంటున్నప్పుడు భయ పడక మన పక్షమున యుద్ధము చేయువాడు యెహోవాయే అని జ్ఞాపకం చేసుకోవాలి (ద్వితి 20:1-4). చిన్న విషయాలలో మనం వ్యక్తిగతంగా దేవుని యందు విశ్వాసం ఉంచడం అభ్యాసం చేస్తే, శక్తికి మించిన పరిస్థితులను ఎదురుకుంటున్నప్పుడు కూడా ధైర్యంగా ఉండగలం. మనం ఏ పరి స్థితుల్లో ఉన్నా, దేవుడు మనతోనే ఉన్నాడని నమ్మడం చాలా ముఖ్యం. ఆయన మనకు అన్నింటిలోనూ సహాయం చేయగలడు.



**డి) దేవుని సన్నిధి మరియు కాపుదల**

కొండలలో, లోయలలో, అడవులలో, ఎడారులలో, అన్ని పరిస్థితులలో, ఎప్పుడైనా, ఎక్కడైనా దేవుడు మనకు తోడుగా ఉన్నాడని గుర్తుంచుకోవాలి (కీర్త 23, 139, యెష 41:10). దేవుడు ఎల్లప్పుడూ మనతోనే ఉన్నాడు. ఆయన మనలను ఎప్పటికీ విడిచిపెట్టడు. మనం ఎక్కడికి వెళ్ళినా, ఏమి చేసినా, ఆయన మనతోనే ఉంటాడు. ఈ విషయాన్ని గుర్తుంచుకోవడం వల్ల మనం భయాన్ని అధిగమించగలం.

**ఇ) దేవుని సార్వభౌమాధికారానికి అప్పగించుకోవడం**

యోసేపు నిస్సహాయ స్థితిలో అమ్మివేయబడి, బాధింపబడినను, దేవుని చిత్తానికి లోబడినప్పుడు తగిన సమయంలో ఐగుప్తు ప్రధానిగా చేయబడ్డాడు (1 పేతు 5:6). మనము దేవుని ప్రేమించి, ఆయన అధికారానికి అప్పగించు కొన్నపుడు, మనకు మేలు నిమిత్తమై సమస్తమును సమకూడి జరుగును (రోమ 8:28). మన జీవితాలను దేవునికి అప్పగించడం ద్వారా, మనం భయపడే అవసరం లేదు. ఆయన మనకు ఎల్లప్పుడూ మేలు చేయాలని కోరుకుంటాడు.

**ఎఫ్) స్తుతి, ఆరాధన, కృతజ్ఞత మరియు ప్రార్థన**

దేవుడు ఏమై ఉన్నాడో జ్ఞాపకం చేసుకొని, కృప ద్వారా అనుగ్రహింపబడిన రక్షణను బట్టి ఆయనను స్తుతిస్తూ, ఆరాధిస్తూ, ఆయన చేసిన మేళ్లను బట్టి కృతజ్ఞతలు చెల్లిస్తూ, ప్రార్థించుట ద్వారా మన భయాలు, చింతలు తొలగించబడతాయి (ఫిలి 4:6). దావీదు వలె 'నేను ఇరుకులో యెహోవాకు మొఱ్ఱపెట్టగా విశాలమందు యెహోవా నాకు ఉత్తరం ఇచ్చెను' అనే అనుభవంలోకి నడిపించబడతాము (కీర్త 118:5). దేవుని స్తుతించడం, ఆయనను ఆరాధించడం, ఆయనకు కృతజ్ఞతలు చెల్లించడం, మరియు ఆయనను ప్రార్థించడం వల్ల మనం భయాల నుండి విముక్తి పొందగలం.

**జి) పరిశుద్ధుల సహవాసం మరియు ప్రార్థన**

మన భయాలను తోటి విశ్వాసులతో పంచుకోవడం, ప్రార్థన సహాయాన్ని కోరడం మరియు ఇతరుల కొరకు మనము కూడా ప్రార్థించడం అవసరం (ఎఫె 5:19-21).

తోటి విశ్వాసులతో సహవాసం చేయడం, వారితో మన భయాలను పంచుకోవడం, మరియు వారి కోసం ప్రార్థించడం వల్ల మనం భయాలను అధిగమించగలం. మనం ఒంటరిగా లేము. మనం దేవుని కుటుంబంలో భాగమని మరియు మనకు సహాయం చేయడానికి ఎల్లప్పుడూ తోటి విశ్వాసులు ఉన్నారని గుర్తుంచుకోవడం చాలా ముఖ్యం.

## భయం నుండి విముక్తి పొందడం: ఒక కొత్త దృక్పథం

జీవితంలో భయపడడం సహజమైనప్పటికీ, ఈ భయం మనల్ని అడ్డుకునేలా, మనల్ని నిరుత్సాహ పరిచేలా అనుమతించకూడదు. దానిని అధిగమించి, మన జీవితాలను మరింత సార్థకంగా, సంతోషంగా చేసుకోవడానికి మార్గాలు ఉన్నాయి.

**ఎ) భయాన్ని వృద్ధికి అవకాశంగా మార్చుకోవడం**

మనం ఎదుర్కొనే ప్రతి భయం ఒక సమస్య అని భావించే బదులు, దానిని వృద్ధికి మరియు స్వీయ ఆవిష్కరణకు ఒక అవకాశంగా పరిగణించాలి. మనకు లేని వాటి గురించి చింతించే బదులు, మనకు దేవుడు ఇచ్చిన వరాలను గుర్తించడం ముఖ్యం.

నిక్ వుజిసిక్, చేతులు, కాళ్ళు లేకుండా జన్మించినప్పటికీ "చేతులు లేవు, కాళ్ళు లేవు, చింతించవద్దు (no arms, no legs but no worries)" అంటూ ప్రపంచమంతా తిరుగుతూ, తన జీవితం ద్వారా దేవుని ప్రేమను ప్రకటిస్తున్నాడు. దీని నుండి మనం నేర్చుకోవాల్సిన పాఠం ఏమిటంటే, మనం ఎదుర్కొనే సవాళ్ళు, కష్టాలు మనల్ని నిరుత్సాహపరచకూడదు, బదులుగా మనల్ని మరింత బలంగా, సాహసోపేతంగా చేయాలి.

**బి) భయాన్ని ఒక అవకాశంగా మార్చుకోవడం**

మన చుట్టూ ఉన్న ప్రపంచం, మన చరిత్రలో భయాలను అధిగమించి విజయం సాధించిన వారితో నిండి ఉంది. ఎస్తేరు, రాజు సముఖంలో నిలబడటం, పేతురు నీళ్ళపై నడవడం, మార్టిన్ లూథర్ కింగ్ జాతి వివక్షపై పోరాటం చేయడం వంటివి దీనికి ఉదాహరణలు. ఈ వ్యక్తులు తమ భయాన్ని అధిగమించి, ప్రపంచాన్ని మార్చారు. అదే విధంగా, మనం కూడా మన భయాన్ని ఒక అవకాశంగా మార్చుకొని, మన జీవితాలను మార్చుకోవచ్చు.

**సి) ఆశావాద దృక్పథం ద్వారా భయాన్ని అధిగమించడం**

మనం భయాన్ని వీడి, ఆశావాదులుగా ఉండాలి. అబ్రహాం దేవుని వాగ్దానాన్ని నమ్మినట్లు, పౌలు దేవుని బలాన్ని ఆధారం చేసుకున్నట్లు, దావీదు దేవుని మీదనే ఆశ పెట్టుకొన్నట్లుగా మనం ఉండాలి. దేవుని ప్రణాళికలు మన పట్ల మంచివి అని నమ్మడం చాలా ముఖ్యం. మన జీవితాలను దేవుని చేతిలో ఉంచి, ఆయన నడిపించే దారిని అనుసరించాలి.

**డి) పరిష్కారంపై దృష్టి సారించడం**

మన దృష్టి భయంపై కాకుండా, దాని పరిష్కారంపై ఉంచాలి. మోషే ఇశ్రాయేలీయులను నడిపించినప్పుడు, ప్రతి సమస్యకు పరిష్కారం దేవుని వద్ద విచారించి, దానిని అమలు చేసాడు. అదే విధంగా, మనం కూడా మన భయాలకు పరిష్కారాల కోసం దేవుని వద్దకు వెళ్ళి, ఆయన మార్గదర్శకత్వం ప్రకారం ముందుకు సాగాలి.

## ముగింపు

భయం మనల్ని చుట్టుముట్టి, పరిస్థితులు బాగాలేవని చెప్తుంది. కానీ మన దేవునికి సమస్తం సాధ్యమేనని అనుభవపూర్వకంగా నమ్మి, ఆయనపై సంపూర్ణంగా ఆధారపడి ముందుకు కొనసాగాలి. మన భయాలను అధిగమించి, దేవుని ప్రేమను, కృపను అనుభవించి, మన జీవితాలను సార్థకం చేసుకోవడానికి మనం ప్రయత్నించాలి.

– రాజకుమారి
బోయన్‌పల్లి జోన్, హైదరాబాద్

# BOOK REVIEW




| | |
|---|---|
| **Book** | : Married to an Angel |
| **Author** | : Stephen P. Mendoza |
| **Publisher** | : GS Books |
| **Pages** | : 191 |
| **Price** | : Rs. 129 |
| **For Copies** | : OM Books |

If a person exhibits godlike qualities, treats their partner with honor, love, and selflessness, cherishing them as God's unique gift, and responds to their deepest needs unselfishly, we readily perceive them as an angel. "Married to an Angel" provides practical steps and insights into the experiences of married couples that contribute to a successful life together.

The book "K.E.Y.S. to a Successful Marriage" outlines four essential steps to a successful marriage: Knowledge, Equity, Yielding, and Satisfaction.


Further, the book beautifully elaborates on the five fundamental biblical reasons for marriage: companionship, assistance, procreation, avoidance of sexual immorality, and as a sign of maturity. "Married to an Angel" delves into eight pillars of marriage, each supported by biblical references:

- **1st Pillar – Spirituality:** A strong marriage requires the foundation of God's Word. Every spouse desires to see the 'Fruit of the Spirit' reflected in their partner. The book explores these nine qualities (love, joy, peace, patience, kindness, goodness, faithfulness, gentleness, and self-control) within the context of marriage.
- **2nd Pillar – Selflessness:** This pillar emphasizes making mental, physical, and spiritual adjustments for the sake of the marriage. It also covers selflessness in areas like finances, social life, interactions with in-laws, personal appearance, and common courtesy.
- **3rd Pillar – Communication:** The Bible serves as an excellent communication guide, demonstrating how God speaks, listens, and understands us. The book highlights how two specific communication patterns can be detrimental: quarreling and excessive quietness.
- **4th Pillar – Trust:** The book emphasizes that a lack of trust in a marriage can be devastating, with adultery having the most severe consequences.
- **5th Pillar – Managing Finances:** The book introduces the TTM concept (likely referring to a specific financial management approach), explores different types of giving, investment and wealth generation and provides biblical guidance on preparing for old age.
- **6th Pillar – Understanding Roles:** This section offers valuable checklists for couples, focusing on 'How do I love my wife?' and 'How do I respect my husband?'.
- **7th Pillar – Commitment:** Commitment is presented as an attitude. The book encourages couples to commit to communication, love, problem-solving, and prayer for their marriage.
- **8th Pillar – Romance:** The authors stress that couples should maintain a vision for their marriage, with a crucial aspect being keeping romance alive throughout their journey together.

Each chapter in the book concludes with review questions designed to promote introspection and self-reflection for both wives and husbands.

**- Triveni Srinu, Ramanthapur Zone, Hyderabad.**

# నవంబర్ '24 పజిల్ - దానియేలు గ్రంథము (11-12 అధ్యాయాలు)




**అడ్డం**

3. ఏ కాలమందు మరలి దక్షిణ దిక్కునకు వచ్చును?
4. ఆ కాలమందు జనుల పక్షమున నిలుచునట్టి మహా అధిపతియగు ఎవరు వచ్చును?
7. అతడు ఏ విషయములో అత్యాగ్రహము గల వాడగును?
9. అందుకతడు ఇచ్చకపుమాటలు చెప్పి ఏమి నతిక్రమించువారిని వశపరచుకొనును?
11. ఎటువంటి రాజు పుట్టి మహా విశాల మైన రాజ్యము నేలి యిష్టానుసారముగా జరిగించును?
12. సమాధులలో నిద్రించు అనేకులు ఏమి అగుదురు?

**నిలువు**

1. అతని రాజ్యము శిథిలమై ఆకాశపు నలు దిక్కుల విభాగింపబడి అతని వంశపువారు దానిని పొందరు గాని ఎవరు పొందుదురు?
2. అనుదిన బలి నిలిపివేసి, నాశనమును కలుగ జేయు ఏ వస్తువును నిలువబెట్టుదురు?
5. ఆ యిద్దరిలో ఒకడు నార బట్టలు వేసికొన్న వాడై ఎక్కడ ఆడుచుండుట దానియేలు చూచాడు?
6. అతడు ఏ జనములతట్టు తన మనస్సును త్రిప్పుకొని యనేకులను పట్టుకొనును?
8. ఎవరు దర్శనమును రుజువుపరచునట్లు కూడుదురు గాని నిలువలేక కూలుదురు?
10. వెయ్యిన్ని మూడువందల ముప్పదియైదు దినములు తాళుకొని కనిపెట్టుకొనువాడు ఎవరు?
11. అతని పక్షమున ఎవరు లేచి, పరిశుద్ధస్థలపు కోటను అపవిత్రపరచుదురు?

– కె.కిరణ్ కుమార్,
స్టాఫ్, మహబూబ్‌నగర్

✦✦✦✦✦✦✦✦

**అక్టోబర్ '24 పజిల్ - దానియేలు గ్రంథము (9-10 అధ్యాయాలు)**

**అడ్డం**


2. కృపాక్షమాపణలుగల
5. చెడునడతలు
9. కల్దీయులపైన
10. ఆయన ముఖప్రకాశము
12. యెరూషలేములో
13. సత్యమును

**నిలువు**


1. మిఖాయేలు
3. గబ్రియేలు
4 మూడు వారములు
6. గ్రేకేయులు
7. సకల దేశములకు
8. వికారమాయెను
10. అతిక్రమించి
11. సత్యగ్రంథమందు

**విజేతలు:** 1. జ్యోతి గంగారాం, కొంపల్లి, 2. వై. సంతోష ఇమ్మాన్యుయేల్, సంగారెడ్డి 3. మహేశ్వరి, స్టడీ సెంటర్


# అతి తక్కువ ధరలో విలువైన సాహిత్యం





Rs 25/-





Rs 25/-





Rs 25/-





Rs 25/-





Rs 25/-




Rs 40/-




Rs 25/-




Rs 25/-




Rs 40/-

UESI PUBLICATIONS Since 1988

**UESI PUBLICATION TRUST - TELANGANA BRANCH**

Edited Printed and Published by Mr. Dasari Rajesh for UESI Publication Trust, Telangana Branch
H. No: 6 - 68/36, Jangampet Village, Jinnaram Mandal, Sangareddy District, Pin-502319
Printed at SRI RR Offset printers, Azamabad, Hyderabad.
(For Private Circulation Only)